
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5

విశాఖపట్నం
జిల్లా వార్తలు
బుధవారం 31 జనవరి 2024


విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న భారత జట్టు కెప్టెన్ రోహిత్‌శర్మ

క్రికెట్ సందడి

2 నుంచి నగరంలో టెస్ట్ మ్యాచ్

- నగరానికి చేరుకున్న భారత్, ఇంగ్లండ్ క్రికెటర్లు

ఇక్కడి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో వచ్చే నెల రెండో తేదీ నుంచి జరగనున్న రెండో టెస్ట్ మ్యాచ్‌లో పాల్గొనే భారత్, ఇంగ్లండ్ ఆటగాళ్లు మంగళవారం సాయంత్రం నగరానికి చేరుకున్నారు. ఇందులో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మతోపాటు బుమ్రా, అశ్విన్, అవేష్ ఖాన్, శ్రీకర్ భరత్, శ్రేయాస్ అయ్యర్, యశస్వి జైస్వాల్, సర్ఫాజ్ ఖాన్, మహ్మద్ సిరాజ్, కులదీప్ యాదవ్, ముకేష్‌కుమార్, అక్షర పటేల్, సౌరబ్‌కుమార్, శుభమన్ గిల్, వాషింగ్టన్ సుందర్, ఇంగ్లండ్ జట్టు కెప్టెన్ బెన్ స్టోక్స్, పోప్, బెయిర్‌స్టో, ఫోక్స్, హార్డ్‌లీ, లీచ్, క్రాలే, జేమ్స్ అండర్సన్, తదితరులు ఉన్నారు. బుధ, గురువారం ఇరుజట్ల ఆటగాళ్లు నెట్ ప్రాక్టీస్ చేయనున్నారు.

- మరిన్ని ఫోటోలు I పేజీలో


ఇంగ్లండ్ జట్టు కెప్టెన్ బెన్ స్టోక్స్

మహాత్మునికి నివాళి


అహింస, సత్యాగ్రహాలే ఆయుధాలుగా అఖండ భారతావనికి స్వాతంత్ర్యాన్ని తీసుకువచ్చిన మహా నాయకుడు, సమస్త విశ్వానికి శాంతి సందేశం ప్రబోధించిన మన జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం నాయకులు, అధికారులు, వేర్వేరు సంఘాల ప్రతినిధులు ఘనంగా నివాళులర్పించారు.

నిరుపేద కుటుంబాల్లో మద్యం చిచ్చు



ఇల్లు, ఒళ్లు గుల్ల

- ఆదాయంలో సగానికిపైగా తాగుడికే ఖర్చు పెడుతున్న రోజువారీ కూలీలు
- రేట్లు పెరగడం, నాణ్యత లేకపోవడంతో ఆర్థికంగా, ఆరోగ్యపరంగా సమస్యలు
- కౌన్సెలింగ్ కోసం తీసుకువెళుతున్న కుటుంబసభ్యులు
- నెరవేరని మద్య నిషేధం హామీ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

'అధికారంలోకి వచ్చిన వెంటనే దశల వారీగా మద్యాన్ని నిషేధిస్తాం. అక్క చెల్లెమ్మల కుటుంబాల్లో చిచ్చు పెడుతున్న మద్యాన్ని స్టార్ హోటళ్లకు పరిమితం చేస్తాం'

- ఇవీ ప్రతిపక్షంలో ఉండగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చెప్పిన మాటలు.

..అయితే, అధికారంలోకి వచ్చిన తరువాత ఆయన ఆ హామీని పూర్తిగా విస్మరించారు. పైగా మద్యం దుకాణాలను ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నడుపుతూ రాష్ట్రానికి ప్రధాన ఆదాయ వనరుగా మార్చారు. ఇంకా ధరలు విపరీతంగా పెరగడం, నాణ్యత లేకపోవడంతో మందుబాబులు ఆర్థికంగా, ఆరోగ్యపరంగా దెబ్బతింటున్నారు. గడిచిన 20 ఏళ్ల నుంచి తాగుతున్నానని, గడిచిన ఐదేళ్ల నుంచి అమ్ముతున్న మద్యాన్ని ఎప్పుడూ చూడలేదని వెంకోజీపాలెంలో నివాసం ఉంటూ తాపీ పని చేసుకుంటున్న రామారావు పేర్కొన్నాడు. వారం కిందట కడుపులో మంటగా ఉండడంతో ఆస్పత్రికి వెళ్లిన రామారావుకు అల్సర్లు ఫామ్ అయ్యాయని వైద్యులు ... మిగతా 6వ పేజీలో



- శివాజీనగర్‌లో ఉంటూ భవన నిర్మాణ పనికి వెళ్లే శ్రీనుకు తాగుడు అలవాటు ఉంది. గతంలో పనికి వెళ్లి వచ్చిన తరువాత తాగి ఇంట్లోనే ఉండేవాడు. ఈ మధ్యకాలంలో ఉన్న డబ్బు మొత్తం తాగుడికే ఖర్చు పెడుతున్నాడు. అతడిని కుటుంబ సభ్యులు మానసిక వైద్యుల వద్దకు తీసుకువెళ్లి చూపించగా, కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. అయినా, ఫలితం లేకుండాపోతోంది. మందులు వాడుతున్న సమయంలో కూడా మద్యం తాగేస్తుండడంతో సమస్య మళ్లీ మొదటకు వచ్చేసింది.
- వన్‌టౌన్ మార్కెట్‌లో పండ్ల వ్యాపారం చేసుకునే అప్పారావు మద్దిలపాలెంలో నివాసం ఉంటున్నాడు. కొన్నాళ్ల నుంచి మద్యం అధికంగా తాగి ఇంటికి వస్తుండడంతో భార్య, భర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతు న్నాయి. మద్యం అలవాటు నుంచి విముక్తి కల్పించేందుకు నిపుణుల వద్దకు తీసుకువెళ్లింది. వారంలో మూడు రోజులు కౌన్సెలింగ్ ఇప్పించడంతోపాటు మందులు వాడారు. రెండు నెలలు మద్యం మానేసిన అప్పారావు...మళ్లీ సంక్రాంతి తరువాత నుంచి ఇష్టం వచ్చినట్టు తాగుతూ ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటున్నాడు.
- శ్రీకాకుళం జిల్లాకు చెందిన రామకృష్ణ అనే యువకుడు నగర పరిధిలోని ఓ టీ దుకాణాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. ఏడాదిన్నర నుంచి మద్యానికి అలవాటుపడ్డాడు. తాగుడుకు అలవాటుపడిన దగ్గర నుంచి షాపు తీయకపోవడం, ఇంటికి ఫుల్లుగా తాగి వెళుతుండడంతో కుటుంబ సభ్యులు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కొద్దిరోజుల కిందట నుంచి వాంతులు అవుతుండడంతో వైద్యుల వద్దకు తీసుకువెళ్లారు. లివర్‌లో సమస్య ఉందని, మందుకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. అతడిని తీసుకుని కుటుంబ సభ్యులు సొంతూరు వెళ్లిపోయారు. వైద్యం కోసం నెల రోజులకు ఒకసారి కేజీహెచ్‌కు వస్తున్నారు.

ఫిల్మ్ క్లబ్ ఎన్నికలు వాయిదా

- వ్యతిరేకించిన మెజారిటీ సభ్యులు
- ఆర్థిక సంవత్సరం ఆడిట్ తరువాతే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్
- క్లబ్ సొమ్ముతో భూమి కొనుగోలుపైనా వ్యతిరేకత



విశాఖపట్నం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి):
వైజాగ్ ఫిల్మ్ క్లబ్ ఎన్నికలు వాయిదా పడ్డాయి. మంగళవారం వార్షిక సాధారణ సమావేశం అని చెప్పి అందరినీ ఆహ్వానించిన ప్రస్తుత కార్యవర్గం...ఎన్నికలు కూడా నిర్వహిస్తామని ప్రకటించింది. దానిని పలువురు సభ్యులు వ్యతిరేకించారు. మార్చిలో ఆడిట్ జరిగిన తరువాత ఎన్నికలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని, ఈసారి కూడా అలాగే చేయాలని, దేశంలో సాధారణ ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో ఇప్పుడు క్లబ్‌కు ఎన్నికలు అవసరం లేదని చెప్పారు. క్లబ్ సభ్యుల నుంచి రుసుములు రూపేణా సేకరించిన మొత్తంతో భీమిలిలో భూమి కొంటామని అధ్యక్షులు కాయల వెంకటరెడ్డి ప్రతిపాదించారు. అక్కడ 7.5 ఎకరాల భూమి రూ.20 కోట్లకు వస్తోందని, దానిని ఏడాది తరువాత అమ్ముకుంటే రూ.30 కోట్లు వస్తాయని వివరించారు. దానిపై పలువురు అభ్యంతరం తెలిపారు. క్లబ్ డబ్బులతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తారా?...అని నిలదీశారు. ప్రభుత్వం నుంచి క్లబ్‌కు భూమి ఇప్పిస్తామని చెప్పి ఎటువంటి ఎన్నికలు లేకుండా వైసీపీ పెద్దల ఆశీస్సులతో కార్యవర్గంలో అధ్యక్ష, కార్యదర్శి పదవులు చేపట్టిన వారు ఎందుకు ఆ పని చేయలేదని కొందరు ప్రశ్నించారు. ఆ ప్రయత్నాలు ఎంతవరకు వచ్చాయో కూడా చెప్పడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పుడు క్లబ్ డబ్బులతో భూమి కొనేస్తే...ఆ తరువాత ప్రభుత్వం రాయితీ ధరకు భూమి ఇస్తుందని గ్యారంటీ ఉందా?...అని మరికొందరు ప్రశ్నించారు. దాంతో అధ్యక్షులు వెంకటరెడ్డి తనపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బ్యాంకులో రూ.30 కోట్ల డిపాజిట్లు ఉంటే...ఎక్కువ వడ్డీ వస్తుందని వేరే బ్రాంచీలకు రూ.10 కోట్లు చొప్పున రెండు బ్యాంకుల్లో వేశామన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం రామానాయుడు స్టూడియో వద్ద కేటాయించిన భూమిని ... మిగతా 6వ పేజీలో

మొక్కుబడిగా ప్లాస్టిక్ నిషేధం

అధికారులకు చిత్తశుద్ధి కరువు

- 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ వినియోగించరాదని రెండేళ్ల కిందట ఆదేశాలు
- ప్రజల్లో చైతన్యం పెంచేందుకు జీవీఎంసీ అవగాహన కార్యక్రమాలు
- ఆరంభంలో హడావుడి చేసి ఆ తరువాత పట్టించుకోని అధికారులు
- చిరు, వీధివ్యాపారుల పైనే ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాల ప్రతాపం
- తయారీసంస్థలు, హోల్‌సేల్ వ్యాపారులపై దృష్టిసారించని వైనం


విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

సింగిల్ యూజ్‌ప్లాస్టిక్‌ నిషేధం అమలు విషయంలో జీవీఎంసీ అధికారులకు చిత్తశుద్ధి లోపించిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పర్యావరణానికి, మానవాళి మనుగడకు పెనుముప్పుగా పరిణమించిన 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ వినియోగాన్ని జీవీఎంసీ చాలాకాలం కిందటే నిషేధించింది. తయారీదారులు, విక్రయదారులతో పాటు వినియోగించే వారిపై కేసులు నమోదు చేస్తామంటూ హెచ్చరించారు. నిషేధం అమలుకు ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను ఏర్పాటుచేశారు. అయితే ఈ బృందాలు చిరు వ్యాపారులపైనే ప్రతాపం చూపుతూ ప్లాస్టిక్ వినియోగానికి మూలమైన వారిని వదిలేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నగరంలో ఒక రోజుకి ఉత్పత్తి అవుతున్న చెత్త	దాదాపు వెయ్యి టన్నులు
అందులో ప్లాస్టిక్ వ్యర్థాలు	వంద టన్నులు
రీసైక్లింగ్ జరుగుతున్న ప్లాస్టిక్	50 టన్నులు
నగరంలో ప్లాస్టిక్ విక్రయిస్తున్న ట్రేడర్లు	153

జీవీఎంసీ పరిధిలో ప్రతిరోజూ సుమారు వెయ్యి టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుంది. అందులో కేవలం ప్లాస్టిక్ వ్యర్థాలే సుమారు వంద టన్నుల వరకూ ఉంటాయని అధికారుల అంచనా. మరో 50 టన్నుల వరకూ ప్లాస్టిక్ వ్యర్థాలు గెడ్డలు, కాలువలు ద్వారా సముద్రంలో కలిసిపోతున్నాయి. కేంద్ర ప్రభుత్వం జారీచేసిన ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ చట్టం-2016 ప్రకారం 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని జీవీఎంసీ ... మిగతా 6వ పేజీలో

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



- దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషిచేయాలి
- ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు పండిట్ రవిశంకర్ - వార్త I పేజీలో

జీవీఎంసీ అదనపు కమిషనర్‌గా నేడు విశ్వనాథన్ బాధ్యతల స్వీకారం



విశాఖపట్నం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి):
జీవీఎంసీ అదనపు కమిషనర్‌గా కేఎస్ విశ్వనాథన్ బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆయన్ను రెండు రోజుల క్రితం జీవీఎంసీ అదనపు కమిషనర్‌గా నియమించిన సంగతి తెలిసిందే. జీవీఎంసీలో ఇప్పటికే ముగ్గురు అదనపు కమిషనర్లు ఉన్నారు. ఐఏఎస్ అధికారి అయిన విశ్వనాథన్‌ను కొత్తగా అదనపు కమిషనర్‌గా నియమించడం చర్చనీయాంశమైంది. కాగా విశ్వనాథ్ కోసం ప్రత్యేక ఛాంబర్‌తోపాటు వాహనం, ఇద్దరు సీసీలు, ఇతర సిబ్బందిని అందుబాటులో ఉంచారు.

వైసీపీలో తెరపైకి కొత్త పేర్లు

ఎమ్మెల్యేలు, సమన్వయకర్తల మార్పుపై ఊహాగానాలు

- గాజువాక నుంచి మేయర్ గొలగాని హరివెంకటకుమారి పేరు పరిశీలిస్తున్నట్టు ప్రచారం
- పెందుర్తి రేస్‌లో చొక్కాకుల వెంకటరావు
- 'సౌత్'లో వాసుపల్లి అభ్యర్థిత్వంపై అధిష్ఠానం పునరాలోచన?
- ఆశావహుల్లో ఉత్కంఠ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో అభ్యర్థులపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఇంకా స్పష్టత ఇవ్వలేదు. మరోవైపు ప్రస్తుతం ఉన్న సమన్వయకర్తలతోపాటు కొత్తగా నియమించిన వారిని కూడా మార్చే ఆలోచనలో ఉందంటూ ప్రచారం జరుగుతోంది. దీంతో తమకు అవకాశం దక్కుతుందేమోనని ఆశావహులు, తమను మార్చేస్తారేమోననే ఆందోళనలో ఎమ్మెల్యేలు/సమన్వయకర్తలు ఉన్నారు.


గొలగాని హరివెంకటకుమారి


చొక్కాకుల వెంకటరావు

2019లో జరిగిన ఎన్నికల్లో జిల్లా పరిధిలోని భీమిలి, గాజువాక, పెందుర్తి అసెంబ్లీ స్థానాలను వైసీపీ గెలుచుకోగా, తూర్పు, దక్షిణం, ఉత్తర, పశ్చిమ నియోజకవర్గాలను టీడీపీ దక్కించుకుంది. ఫలితాల తర్వాత దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ వైసీపీకి మద్దతు ప్రకటించారు. టీడీపీ అభ్యర్థులు గెలిచిన నియోజక వర్గాల్లో ఓడిపోయిన వారిని వైసీపీ సమన్వయకర్తలుగా నియమించింది. వారి ద్వారానే నియోజకవర్గంలో కార్యక్రమాలు జరిగేలా అధికారులకు ఆదేశాలివ్వడంతో వారే ఎమ్మెల్యేలుగా చలామణి అవుతూ వస్తున్నారు. అయితే కొద్దిరోజుల కిందట తూర్పు సమన్వయకర్తగా ఉన్న అక్కరమాని విజయనిర్మలను తప్పించి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణను తూర్పు సమన్వయకర్తగా నియమించింది. ఆ తర్వాత గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కుమారుడు దేవన్‌రెడ్డిని నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తప్పించి 70వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి రామచంద్రరావును నియమించింది. ఇన్‌చార్జులుగా ఇప్పుడు నియమితులైనవారే వచ్చే ఎన్నికల్లో అభ్యర్థులంటూ పార్టీ ముఖ్య నేతలు ప్రకటించారు. అయితే కొత్తగా సమన్వయకర్తలను నియమించినచోట పార్టీకి తలనొప్పులు మొదలవుతున్నాయి. అలాగే సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఉన్నచోట కూడా వారికి టికెట్ ఇస్తే సహకరించేది లేదంటూ ధిక్కారస్వరాలు నేతలు, కార్యకర్తలు నుంచి వ్యక్తమవుతున్నాయి. దక్షిణ నియోజకవర్గం విషయానికి వస్తే ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కు టికెట్ ఇస్తే సహకరించేది లేదంటూ నియోజకవర్గం పరిధిలోని కార్పొరేటర్లు పార్టీ ముఖ్య నేతల ముందే కుండబద్దలు కొట్టారు. అయినప్పటికీ అధిష్ఠానం పట్టించుకోకపోవడంతో ఇద్దరు కార్పొరేటర్లు పార్టీని వీడి వెళ్లిపోగా, మరో నలుగురిని పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. నియోజకవర్గంలోని మిగిలిన వర్గాల నుంచి కూడా వాసుపల్లి పట్ల వ్యతిరేకత వ్యక్తమవుతుండడంతో అధిష్ఠానం కూడా పునరాలోచనలో పడినట్టు నేతలు చెబుతున్నారు. మరో అభ్యర్థి కోసం సర్వే కూడా చేయిస్తున్నట్టు పేర్కొంటున్నారు. ఇక గాజువాక నియోజకవర్గం నుంచి కొత్తగా ఇన్‌చార్జిగా నియమితులైన ఉరుకూటి రామచంద్రరావు పోటీకి దిగడం ఖాయమని అంతా భావించారు. అయితే సిట్టింగ్ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఆయన్ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఆయనకు కాకుండా ఎవరికి టికెట్ ఇచ్చినా తనకు అభ్యంతరం లేదని పార్టీ అధిష్ఠానానికి చెప్పినట్టు తెలిసింది. దీంతో ఉరుకూటి రామచంద్రరావు స్థానంలో అదే సామాజిక వర్గానికి చెందిన మేయర్ గొలగాని వెంకటహరికుమారిని బరిలోకి దింపితే ఎలా ఉంటుందని...పార్టీ పెద్దలు పరిశీలిస్తున్నట్టు తెలిసింది. పెందుర్తి నియోజకవర్గం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కి టికెట్ లేదని ... మిగతా 6వ పేజీలో

'గంటా'తో అనిత భేటీ



గంటాతో మాట్లాడుతున్న అనిత

అక్కయ్యపాలెం, జనవరి 30: మాజీ మంత్రి, ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో మంగళవారం తెలుగు మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. రానున్న రోజుల్లో రాజకీయ, పార్టీ పరంగా సహాయ సహకారాలు అందించాలని ఆమె కోరారు. ఎన్నికలు దృష్ట్యా టీడీపీ నాయకులు, కార్యకర్తలు అహర్నిశలు కృషి చేసి జనసేన, టీడీపీల ఉమ్మడి గెలుపునకు కృషి చేయాలనిఈసందర్భంగా గంటా సూచించారు.

ఉత్తరాంధ్ర స్థాయి బాక్సింగ్ పోటీలు ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న అతిథి వెంకటరావు

అక్కయ్యపాలెం, జనవరి 30: సిటీ బాక్సింగ్ క్లబ్ ఆధ్వర్యంలో కైలాసపురం మధుసూదన్‌నగర్‌లో ఉత్తరాంధ్ర బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీలను వీఎస్‌కేపీ సీపీఐఆర్‌యూడీఏ చైర్మన్‌న చొక్కాకుల వెంకటరావు మంగళవారం ప్రారంభించారు. విశాఖపట్నం పోర్టు అథారిటీ యూనియన్ నాయకుడు గొర్లె చంద్రు, ఇంటర్నేషనల్ అవెంజిస్ ప్రతినిధి పి. రాజేష్, విజయ్‌కుమార్, వీఎస్ విశాఖ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యల్లపు రఘురాం, జనరల్ సెక్రటరీ వాసుపల్లి అప్పారు, ఆర్వోసీ వి.రూబెన్, సీనియర్ రిఫరి టీవీఎస్ఎన్ అనిల్ కుమార్, డి.కనకరాజు పాల్గొన్నారు.

బీసీ చైతన్య వేదిక నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

మహారాణిపేట, జనవరి 30: మహారాణిపేటలోని బీసీ చైతన్య వేదిక కార్యాలయంలో పలువురు ప్రముఖులు మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్షుడిగా పెదపెంకి శివ ప్రసాదరావు, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడిగా దాసరి జ్ఞాన మూర్తి, అనకాపల్లి జిల్లాఅధ్యక్షుడిగా ఎస్‌వీవీ రామచంద్రరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పలువురు నూతన కమిటీ సభ్యులుగా నియమితులయ్యారు. ఈసందర్భంగా శివ ప్రసాదరావు మాట్లాడుతూ ఇంతవరకు బీసీలకు చట్టసభల్లో ప్రాతి నిధ్యంలేదన్నారు. ఇకపై సమష్టిగా తమ సత్తా చాటుతామన్నారు. వివిధ సామాజిక వర్గాలకు చెందిన నాయకుల ఉండవల్లి శ్రీని వాసరావు, వడ్లపూడి ఈశ్వరరావు, ఆతవ సుబ్బారావు, అనసూయ, వైవీ రమణమూర్తి, రామచంద్రరావు, రమేష్, సాయి కుమార్, తదితరులు పాల్గొన్నారు. జననాయక్ కర్పూరి ఠాగూర్‌కు కేంద్ర ప్రభుత్వం భారత రత్న ప్రకటించడంపై హర్షం వ్యక్తంచేశారు.

లోకోషెడ్ పరిశీలన

విశాఖపట్నం, జనవరి 30: రైలే డీఆర్ఎం సౌరబ్ ప్రసాద్ ఎలక్ట్రికల్ లోకోషెడ్‌లో మంగళవారం పర్యటించారు.లోకో ఎగ్జామినేషన్ పాయింట్లుతోపాటు అక్కడ జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు.



మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్సు పార్కులో విగ్రహానికి నివాళులర్పిస్తున్న సభ్యులు



గాంధీజీ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న జనసేన నాయకులు

జాతిపిత ఆశయాలు అనుసరణీయం

» వాడవాడలా మహాత్మునికి వర్ధంతి

డాబాగార్డెన్స్, జనవరి 30: అహింస, సత్యాగ్రహం ఆయుధాలుగా అఖండ భారతావనికి స్వేచ్ఛను ప్రసాదించిన మహా నాయకుడు జాతిపిత మహాత్మా గాంధీ అని వక్తలు కొనియాడారు. గాంధీ 76వ వర్ధంతి సందర్భంగా మాజీ పార్లమెంట్ సభ్యులు కొణతాల రామకృష్ణ, 22వ వార్డు కార్పొరేటర్ పీతలమూర్తియాదవ్ , చలసాని గాంధీ, కిరణ్‌ప్రసాద్, నాగలక్ష్మి చౌదరి, త్రివేణి, శారిణీదేవి, ధనలక్ష్మి, పోతు వెంకటప్రసాద్, చంద్రశేఖర్ గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ, సమస్త విశ్వానికి శాంతి సందేశం ప్రబోధించిన మహనీయులు జాతిపిత అని అన్నారు.

ఛాయా చిత్రాల ప్రదర్శన

డాబాగార్డెన్స్: అహింస ఉత్సవాలను అఖిల భారత సర్వోదయ సంస్థల ఆధ్వర్యంలో రామకృష్ణాబీచ్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్వోదయ సంఘం విశాఖ అధ్యక్షులు డా.విజయ్‌చంద్ర, ప్రముఖ గాంధేయవాది జుబెరుల్లఖాన్, విశాంత్ర ఆచార్యులు కోటి జాన్ , వివిధ పార్టీల నేతలు హాజరయ్యారు. విశాంత్ర ఆచార్యుడు జీకే సుబ్రహ్మణ్యం గాంధీజీ ఛాయచిత్రాల ప్రదర్శన నిర్వహించారు. క్విట్ ఇండియా, స్వరాజ్య సమర ఘట్టాలను ఛాయాచిత్రాల ద్వారా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పర్యాటకులు పాల్గొన్నారు.

మహాత్ముని ఆశయ సాధనకు పనిచేయాలి

పూర్ణామార్కెట్: మహాత్మాగాంధీ ఆశయసాధన కోసం ప్రతీ ఒక్కరూ పనిచేయాలని బ్రహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్, దక్షిణ నియోజకవర్గ సీనియర్ నాయకుడు సీతంరాజు సుధాకర్ పేర్కొన్నారు. మంగళవారం 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరావు ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భగా మాట్లాడుతూ స్వాతంత్ర్య సాధన కోసం గాంధీ మహాత్ముడు అనుసరించిన మార్గం అందరికీ ఆదర్శమని అన్నారు.

వైశాఖీ స్పోర్ట్సు పార్కులో ..

మురళీనగర్; మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్సు పార్కులో మంగళవారం గాంధీజీ వర్ధంతి సందర్భంగా అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. పార్కు కమిటీ అధ్యక్షులు సనపల.వరప్రసాద్ ఆధ్వర్యంలో పార్కు ప్రాంగణంలోని గాంధీజీ విగ్రహానికి కమిటీ సభ్యులు, వనిత వాకర్స్ సభ్యులు నివాళులర్పించారు. పార్కు కమిటీ కార్యదర్శి పి.నాగరాజు, వనితా వాకర్స్ క్లబ్ మహిళలు సభలో ఉన్నారు. మురళీనగర్ వాకర్స్ క్లబ్‌లో అధ్యక్షులు పల్లా. చంద్రమౌళి నేతృత్వంలో గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. వాకర్స్ క్లబ్ జిల్లా ప్రతినిధులు ద్వారకానాద్, క్లబ్ పూర్వ కమిటీ సభ్యులు సీహెచ్ కృష్ణమూర్తి ఉన్నారు.

జ్ఞానాపురం: గ్రేటర్ 32వ వార్డులోని జనసేనపార్టీ కార్యాలయంలో కార్పొరేటర్ కందుల నాగరాజు ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి నివాళులు ఆర్పించారు. అనంతరం ప్రమాదంలో గాయపడిన ఆటోడ్రైవర్ కుటుంబానికి నిత్యవసరసరకులు అందజేశారు. 33వ వార్డు పరిధిలోని నీలమ్మచెట్టు ఆలయ ట్రస్ట్ చైర్మన్ బొర్రా విజయలక్ష్మి, బొర్రాశ్రీనివాసరెడ్డి అల్లిపురంలోని గాంధీ విగ్రహంవద్ద నివాళులర్పించారు. జ్ఞానాపురంలో వార్డు కార్పొరేటర్ కోడిగుడ్లపూర్ణిమ, శ్రీధర్ నివాళులు అర్పించారు. సెయింట్ జోసెఫ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ పీవో డా.మాణిక్యకుమారి ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతి నిర్వహించారు. ప్రిన్సిపాల్ డా.సిస్టర్ షైజీ పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం: గ్రేటర్ 46వ వార్డు కస్తూరినగర్‌లో సిద్ధి వినాయక సేవా సంఘం ఏర్పాటు చేసిన జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి జనసేన పార్టీ ఉత్తర నియోజకవర్గం ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్ నివాళులర్పించారు. నాయకులు శ్రీను, చలపతి రావు, శంకర్, సతీష్, శివారెడ్డి, దామోదర్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో నివాళి..

మహారాణిపేట: జాతిపిత మహాత్మా గాంధీ దేశానికి చేసిన సేవలు ఎనలేనివని జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్ కొనియాడారు. గాంధీ వర్ధంతి సందర్భంగా కాలెక్టరేట్ పార్కులోని విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గాంధీ తోనే దేశానికి స్వేచ్ఛాస్వాతంత్ర్యం వచ్చిందన్నారు. ఆయన దేశం కోసం ప్రాణాలర్పించారన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో కె. మోహన్‌కుమార్, ఏవో ఈశ్వరరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సర్వోదయ సంఘం ప్రతినిధులు

అమరవీరుల దినోత్సవం

విశాఖపట్నం: వాల్తేరు డివిజన్‌లో మంగళవారం అమరవీరుల దినోత్సవం జరిగింది. ఈసందర్భంగా డీఆర్ఎం సౌరబ్‌ప్రసాద్‌తోపాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొని రెండు నిమిషాలపాటు మౌనం పాటించి స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించారు. స్వాతంత్ర్య పోరాటంలో త్యాగం చేసిన వారికి గుర్తుగా ఏటా జనవరి 30న షహీద్ దివస్ నిర్వహిస్తారని పేర్కొన్నారు.



స్వాతంత్ర్య యోధులకు నివాళులర్పిస్తున్న రైల్వే అధికారులు

'ముస్లింలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి'



టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లాకు వినతి పత్రాన్ని అందిస్తున్న ముస్లిం నాయకులు

మహారాణిపేట, జనవరి 30: ఉత్తరాంధ్ర జిల్లాలో గత 30 ఏళ్లుగా రాజకీయ ప్రాతి నిధ్యం లేని ముస్లిం మైనారిటీ వర్గాలకు ఈసారి ఎన్నికల్లోనైనా న్యాయం చేయాలని విశాఖ జిల్లా ముస్లిం మైనారిటీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును వారు మర్యాదపూర్వకంగా కలసి వినతి పత్రాన్ని అందించారు. అనంతరం సీనియర్ ముస్లిం మైనారిటీ నాయకుడు అబ్దుల్ చిన రహమాన్ మాట్లాడుతూ.. ఉత్తరాంధ్ర జిల్లాలోని 34 అసెంబ్లీ నియోజకవర్గాలలో ముస్లిం ఓటర్లు ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయగల స్థాయిలో ఉన్నారన్నారు. అయినా, 1994 నుంచి మూడు జిల్లాల్లో ముస్లింలకు ఎటువంటి అవకాశం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈసారి తమ సామాజిక వర్గానికి టికెట్టు కేటాయిస్తే శాతశాతం గెలిపించుకుం టామన్నారు. పల్లా ఈ విషయం అధిష్టాన వర్గం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చూస్తానన్నారు. ముస్లిం నాయకులు మహ్మద్ జఫ్రుల్లా, మహ్మద్ సలీమ్, షేక్ బాజీ, షేక్ కాలేషా, షేక్ రహ్మతల్లా , గౌస్ , రఫీ, సయ్యద్ హుస్సేన్, యాసిన్, తానూజ, ఆజీ జ్, రహీమ్, రబ్బానీ, అహ్మద్, నౌషద్ పాల్గొన్నారు.

మొక్కుబడిగా ప్లాస్టిక్ నిషేధం

... 5వ పేజీ తరువాయి

నిషేధించింది. నిషేధం అమలు కావాలంటే ప్రజల్లో చైతన్యం అవసరమని గుర్తించిన అధికారులు అప్పటి నుంచి నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. మొదట వినియోగదారులు, వ్యాపారులకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలుపై కౌన్సెలింగ్ చేసి, తర్వాత కేసులు నమోదు, జరిమానాలు విధించడం మొదలుపెట్టారు. లక్ష్మీషా కమిషనర్‌గా ఉన్నప్పుడు ప్లాస్టిక్ నిషేధం పక్కాగా అమలు కావడంతో ప్రత్యామ్నాయాలపై వ్యాపారులు, ప్రజలు దృష్టిసారించారు. కమిషనర్, మేయర్‌తోపాటు జీవీఎంసీ అధికారులు, ఎన్‌జీవోలు, స్వచ్ఛభారత్ బ్రాండ్ అంబాసిడర్లు కలిసి మార్కెట్లు, రైతుబజార్లు, వీధివర్తకుల వద్దకు వెళ్లి ప్లాస్టిక్ సంచులకు బదులు గుడ్డ, నారసంచులను వాడాలని అవగాహన కల్పించారు. దీంతో ప్లాస్టిక్ వినియోగం గణనీయంగా తగ్గింది. అయితే లక్ష్మీషా తరువాత వచ్చిన కమిషనర్లు ప్లాస్టిక్ నిషేధంపై నిర్లక్ష్యం వహించడంతో మళ్లీ వినియోగం పెరిగిపోయింది. దీనిపై తీవ్రస్థాయిలో విమర్శలు రావడంతో జీవీఎంసీ పరిధిలో వార్డు వలంటీర్లుగా పనిచేస్తున్న 30 మందిని ప్లాస్టిక్ నియంత్రణకు ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలుగా ఏర్పాటుచేశారు. ముగ్గురి చొప్పున ఒక బృందంగా ఏర్పాటుచేసి వారికి ప్రత్యేకంగా యూనిఫారం, ఒక వాహనాన్ని సమకూర్చారు. ప్రతీరోజూ వారు తమకు కేటాయించిన ప్రాంతాల్లో తిరుగుతూ సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ విక్రయించే దుకాణాలపై దాడులు చేసి, జరిమానాలు విధిస్తున్నారు.

చిరు వ్యాపారులపైనే ప్రతాపం

ప్లాస్టిక్ నిషేధం అమలుకోసం ఏర్పాటుచేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు వీధివ్యాపారులు, రోడ్డపక్కనే తోపుడు బండ్లపై వ్యాపారం చేసేవారిపైనే ప్రతాపం చూపుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్లాస్టిక్ తయారుచేసే యూనిట్లు, ఇతర ప్రాంతాల నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు నగరానికి దిగుమతి చేసుకుని, రిటైల్ వ్యాపారులకు విక్రయించే హోల్‌సేల్ ట్రేడర్లను వదిలేసి, చిరు వ్యాపారులపై కేసులు నమోదుచేయడం వల్ల ఉపయోగం ఏముంటుందని నగరవాసులు ప్రశ్నిస్తున్నారు. జీవీఎంసీ పరిధిలో 153 మంది హోల్‌సేల్ ట్రేడర్లు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. వీరిలో ఇద్దరు భీమిలి జోన్, 15 మంది అనకాపల్లి జోన్‌లో ఉండగా మిగిలిన వారంతా నగరంలోనే ఉంటున్నారు. అధికారులకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే అలాంటి వారిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ నిరంతర నిఘా ఉంచి, ప్లాస్టిక్‌ను దిగుమతి చేసుకుంటే కేసులు నమోదుచేసి, భారీగా జరిమానాలు విధించాలని సూచిస్తున్నారు. అప్పుడే నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగానికి అడ్డుకట్టపడుతుందని అభిప్రాయపడుతున్నారు. కాగా, నగరంలో ఉత్పత్తి అవుతున్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రీసైక్లింగ్‌కు పదమూడు యూనిట్లు ఏర్పాటుచేశారు. అయితే ప్రతిరోజూ సుమారు 150 టన్నులు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తి అవుతుంటే అందులో 50-70 టన్నులు మాత్రమే రీసైక్లింగ్ చేయగలుగుతున్నారు. మిగిలిన ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రంలోనూ, భూమిలో కలిసిపోతున్నాయి.

ఫిల్మ్ క్లబ్ ఎన్నికలు వాయిదా

... 5వ పేజీ తరువాయి

ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చే అవకాశం లేదని తేల్చేశారు. అయితే ఎక్కడో ఓ చోట అడుగుతామని హామీ ఇచ్చారు. ప్రస్తుతానికి క్లబ్ సొమ్ముతో భూమి కొనే ప్రతిపాదనను పక్కన పెట్టాలని తీర్మానం చేయాలని సభ్యులు కోరారు. ఏ నిర్ణయం తీసుకోకుండానే సమావేశం ముగించారు. క్లబ్ ఎన్నికల తరువాత ఏర్పడే కొత్త కార్యవర్గం అన్నీ చర్చించి నిర్ణయాలు తీసుకుంటుందని, ఇంకో రెండు నెలల్లో దిగిపోయే కార్యవర్గం కీలక నిర్ణయాలు తీసుకోవడం తగదని పలువురు అభిప్రాయపడడంతో వైసీపీ అనుకూల బృందం మిన్నకుండిపోయింది.

విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు



విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేస్తున్న గాయత్రి కాలేజీ వైద్యులు

పూర్ణామార్కెట్, జనవరి 30: వన్‌టౌన్‌లోని క్విన్‌మేరీ గర్ల్స్ హైస్కూల్ ఆవరణలో వేదాంత గూడ్స్ కార్గో, ఎఫ్ఎక్స్‌బీ ఇండియా సురక్ష (ఎన్‌జీవో) సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు వి.జోగేంద్రనాద్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. గాయత్రి మెడికల్ కాలేజీ వైద్యులు 189 విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులు పంపిణీ చేశారు. వేదాంత గూడ్స్ కార్గో బర్త్ ప్రైవేట్ లిమిటెడ్ సీఆర్ఎస్ మేనేజర్ సి.ఎస్. శ్రీలక్ష్మి, ఎఫ్ఎక్స్‌బి సురక్ష ప్రాజెక్టు మేనేజర్ వై.అశోక్‌కుమార్ పర్యవేక్షించారు.వైద్యులు పల్లవి, డి.చంద్రకళ, టీడీ హెల్త్‌విజిటర్ ఎస్.ఉషా, కె.గోపి (ఎస్‌టీఎల్ఎస్) టి.శ్రీదేవి (ఎస్‌టిఎస్) ఎఫ్ఎక్స్ కు చెందిన టి.సునీత, కె.రాయతి పాల్గొన్నారు.

అయ్యన్నను కలిసిన విల్లూరి దంపతులు

అల్లిపురం, జనవరి 30: తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్న పాత్రుడిని టీడీపీ విశాఖ పార్లమెంట్ పార్టీ ఉపాధ్యక్షుడు విల్లూరి డాక్టర్ చక్రవర్తి, 33వ వార్డు టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి విల్లూరి తిరుమలదేవి మంగళవారం నగరంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలసి శాలువతో సత్కరించారు. పార్టీకి వారు చేస్తున్న కార్యక్రమాలను వివరించారు.

జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అప్పులపాలు

» టీడీపీ దక్షిణ ఇన్‌చార్జి గండి బాబ్జీ

అల్లిపురం, జనవరి 30: ముఖ్యమంత్రి జగన్ రెడ్డి పాలనలో రాష్ట్రం రూ. 13 లక్షల కోట్ల అప్పుల్లో కూరుకుపోయిందని తెలుగుదేశం పార్టీ దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ ఆందోళన వ్యక్తంచేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రా కదలిరా పిలుపు ద్వారా ప్రతిపక్షనేత చంద్రబాబు.. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ నెలరోజులుగా అవిశ్రాంతంగా పోరాడుతున్నారు. టీడీపీకి 5కోట్ల మంది ప్రజలు స్టార్ క్యాంపెనర్లుగా మద్దతు తెలుపుతున్నారన్నారు. రాష్ట్రంలో నేరాల శాతం బాగా పెరిగినట్టు నేషనల్ క్రైమ్ నివేదికలు సూచిస్తున్నాయన్నారు. మహిళలపై నేరాల్లో ఏపీ 6వ స్థానంలో ఉందని అన్నారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే రైతులపై రుణభారం ఏపీలోనే ఎక్కువగా ఉందన్నారు. గతంలో ముఖ్యమంత్రి జగన్ వైనాట్ 175 ధీమా వ్యక్తంచేశారని, ఇప్పుడు ఓడిపోయినాతప్పులేదన్న స్థితికి రావడం గమనించదగిన అంశమన్నారు. ప్రజలు ఆయనకు గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

ముగిసిన క్రికెట్ పోటీలు



విజేతలతో అతిథులు

అక్కయ్యపాలెం, జనవరి 30: ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్స్ వీడియోగ్రాఫర్స్ విశాఖ సంఘం ఆధ్వర్యంలో గత నాలుగురోజులుగా పోర్టు స్టేడియంలో జరుగుతున్న ఫౌండర్స్ నైన్ క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో 8 జట్లు పోటీపడ్డాయి. ఫౌండర్స్ నైన్ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా డ్రాగన్స్ వారియర్స్ జట్టు నిలిచింది. విజేతలకు సంఘం చైర్మన్ ఎన్‌పీఎస్ఎస్ ప్రసాద్, అధ్యక్షుడు సీహెచ్ మధు, అడ్వయిజర్లు టీవీఆర్ఎం రాజు, ఎం.విజయ్, సిమ్మా మధు బహుమతులు ప్రదానం చేశారు.

నిరుపేద కుటుంబాల్లో మద్యం చిచ్చు

... 5వ పేజీ తరువాయి

చెప్పారు. తాగుడుకు దూరంగా ఉండకపోతే ప్రమాదమని హెచ్చరించారు.

ఆదాయంలో సగానికిపైగా మందుకే...

శ్రీకాకుళం జిల్లాకు చెందిన బాలకృష్ణ పదిహేనేళ్ల కిందట ఉపాధి నిమిత్తం విశాఖ వచ్చాడు. ఇసుకతోటలో నివాసం ఉంటూ పెయింటింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. నగరానికి వచ్చే నాటికి మద్యం అలవాటు ఉంది. ప్రతిరోజూ పనికి వెళ్లి వచ్చిన తరువాత ఒక సీసా కొనుగోలు చేసి ఇంటికి వచ్చి తాగి, తిని పడుకునేవాడు. మిగిలిన మొత్తాన్ని భార్యకు ఇచ్చేవాడు. కానీ, గడిచిన మూడున్నరేళ్ల నుంచి మద్యానికి పూర్తిగా బానిసగా మారాడు. ఉదయాన్నే పనికి వెళ్లడం, రాత్రికి ఎప్పుడో పూటుగా తాగి ఇంటికి రావడం పరిపాటిగా మారింది. ఒక్కోరోజు ఇంటికి కూడా రాకుండా ఆ షాపు బయట నిద్రపోతున్నాడు. పదేళ్ల వయసున్న ఇద్దరు పిల్లలతో అతడి భార్య బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తోంది. ఏం చేయాలో, ఎవరికి చెప్పాలో కూడా తెలియక తీవ్రంగా మథనపడుతోంది. కుటుంబ సభ్యులు చెప్పినా అతడిలో మార్పు రాలేదు. గతంతో పోలిస్తే ప్రస్తుతం విక్రయిస్తున్న మద్యం కిక్ ఇవ్వడం లేదని, తాగుతున్న ఫీలింగ్ రాకపోవడం వల్లే ఇంకా తాగాలనిపిస్తోందని హెచ్‌బీ కాలనీలో ఉంటూ బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్న రవి తెలిపాడు. గతంలో బీర్ తాగే అలవాటు ఉండేదని, ఇప్పుడు అన్నింటికీ అలవాటు పడిపోయానని, బయటపడేందుకు చేస్తున్న ప్రయత్నాలు విఫలమవుతున్నట్టు ఆవేదన వ్యక్తంచేశాడు. ఇటువంటి వాళ్ల సంఖ్య గడిచిన కొద్దికాలంగా పెరిగింది. ఆదాయంలో సగానికి మించి, పూర్తిగా కూడా మందుకే ఖర్చు పెడుతున్న వారి సంఖ్య పెరిగింది. రోజువారీ కూలికి వెళ్లి ఆదాయం తెచ్చుకునే ఎంతోమంది కుటుంబాల్లో ఇదే పరిస్థితి ఉంది. రోజు కూలికి వెళితే ఐదు వందలు నుంచి ఏడు వందల రూపాయల వరకు వస్తే..అందులో మూడు, నాలుగు వందలు మద్యానికే ఖర్చు చేసేస్తున్నారు. దీంతో కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడుతున్నారు.

తాగాలనిపిస్తుండడం వల్లే...

ఈ మధ్య కాలంలో తాగుడుకు బానిసలుగా మారిన వారి సంఖ్య పెరుగుతున్నట్టు మానసిక వైద్యులు చెబుతున్నారు. గతంలో కాస్తో, కూస్తో తాగేవారని, ఇప్పుడు పరిధికి మించి తాగుతూ ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తున్నారంటూ మద్యానికి బానిసైన వారిని కుటుంబ సభ్యులు మానసిక వైద్యుల వద్దకు తీసుకువెళుతున్నారు. ప్రతి పది కేసుల్లో కనీసం నాలుగు అవే ఉంటున్నాయని ప్రముఖ మానసిక వైద్య నిపుణులు ఎన్ఎన్ నిహాల్ తెలిపారు. కొంతమంది ఉదయం మొదలుపెట్టి రాత్రి పడుకునేంత వరకు తాగుతూనే ఉంటున్నారని, అటువంటి వారికి శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఆరోగ్యం దెబ్బతింటుందని ఆయన వెల్లడించారు.

వైసీపీలో తెరపైకి కొత్తపేర్లు

... 5వ పేజీ తరువాయి

పార్టీ అధిష్ఠానం స్పష్టంచేసినట్టు పార్టీ నేతలు బహిరంగంగానే చెబుతున్నారు. ఆయన స్థానంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు లేదా ఆదీప్‌రాజ్ సామాజిక వర్గానికే చెందిన వారికే టికెట్ ఇవ్వాలని భావిస్తున్నట్టు తెలిసింది. వీసీపీఐఆర్ చైర్మన్ చొక్కాకుల వెంకటరావు పేరును పరిగణనలోకి తీసుకుని సర్వే చేయిస్తున్నట్టు పార్టీ నేతలు చెబుతున్నారు. మరోవైపు మారిటైమ్ బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి కూడా వచ్చే ఎన్నికల్లో ఏదో ఒకచోట నుంచి పోటీ చేయాలని భావిస్తున్నారు. ఆయన ఉత్తరం సీటు కోరుకుంటున్నట్టు ప్రచారం జరుగుతోంది.

గాయని సాహితీకి వేటూరి పురస్కారం

డాబాగార్డెన్స్, జనవరి 30: వర్ధమాన సినీ నేపథ్య గాయని సాహితీకి వేటూరి యువ గాయని పురస్కారం ప్రదానం చేయడం అభినందనీయమని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం రాత్రి డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సినీ గేయ రచయిత వేటూరి సుందర రామ్మూర్తి 98వ జయంతిని ఆత్రేయ స్మారక కళాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలుగు పదానికి జానపదం... వేణువై వచ్చాను..భువనానికి..రాలిపోయే పువ్వా నీకు వర్ణాలెందుకే వంటి గీతాలతో తెలుగు ప్రజల గుండెల్లో వేటూరి నిలిచిపోయారన్నారు. ఆయన పేరిట పురస్కారం సాహితికి అందించారు. అనంతరం శంబర జోగారావు సారథ్యంలో సంగీత విభావరి జరిగింది. సాహితీ, రమేష్ పట్నాయక్ పాడిన వేటూరి గీతాలు వేదం అణువణువనవాదం, జోగారావు, హారిక పాడిన శ్రీలక్ష్మీ పెళ్లికి, బాల గణేశ్ , లిపిక పాడిన కిన్నెరసాని వచ్చిందమ్మా తదితర వాటితో ఆకట్టుకున్నారు. ప్రధాన కార్యదర్శి గంటి మురళీ, విజయనగరంనకు చెందిన నేత అవనాపు విజయ్, పైడా కృష్ణప్రసాద్, పీఠం అధ్యక్షులు ఉసిరికాల చంద్రశేఖర్, సుహాసినీ ఆనంద్, దాడి సత్యనారాయణ పాల్గొన్నారు.



సాహితీకి పురస్కారం ప్రదానం చేస్తున్న మాజీమంత్రి గంటా, తదితరులు

49వ వార్డులో 'జనంలోకి జనసేన'



ఎస్‌జీజీటీఎస్ కాలనీలో ప్రచారం చేస్తున్న ఉషాకిరణ్, కార్యకర్తలు

మురళీనగర్, జనవరి 30 ; ఉత్తర నియోజకవర్గంలోని 49వ వార్డు మురళీనగర్ ఎస్‌జీజీటీఎస్ కాలనీలో మంగళవారం "జనంలోకి జనసేన" కార్యక్రమం నిర్వహించారు. పార్టీ ఇన్‌చార్జి పి.ఉషాకిరణ్ ఈసందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రంలో పాలన స్తంభించిందని అన్నారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులో కూరుఉపోయేలా చేసిందని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన ఉమ్మడి గెలుపు కోసం ప్రజా మద్దతుతో ముందడుగేస్తున్నామన్నారు. వార్డు పరిధి ప్రాంతాల్లో నాయకులు తిరిగి ప్రచారం చేశారు.ఈ జనసేన నాయకులు సంకు.వెంకటేశ్వరరావు, 51వవార్డు పార్టీ అధ్యక్షులు జి.అప్పారావు, వీరమహిళలు, పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

పోలమాంబకు మారువారం పూజలు

జగదాంబ కూడలి, జనవరి 30: జీవీఎంసీ 30 వార్డు కుమ్మరివీధిలోని పోలమాంబ ఆలయంలో మంగళవారం మారువారం ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ఉదయం ఆలయం ఎదుట బహుముఖ రూపాల్లో ఉన్న అమ్మవారి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి తొలి పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం ప్రాంగణంలో ఏర్పాటుచేసిన భజన గీతాలాపన కార్యక్రమం అలకరించింది. భక్తులకు ఉచితప్రసాదాలనుఅందజేశారు. కమిటీ ప్రత్యేకంగా పర్యవేక్షించింది. గత మంగళవారం పరస ఉత్సవాలు నిర్వహించిన విషయం తెలిసిందే.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

పోలింగ్ బూత్‌లు తనిఖీ

సీతమ్మధార, జనవరి 30: ద్వారకా పోలీసు స్టేషన్ పరిధిలోని ఎన్నికల పోలింగ్ బూత్‌లను సీఐఎస్.రమేశ్, ఎస్ఐలు జె. ధర్మేంద్ర, కె.శ్రీను సిబ్బందితో కలిసి మంగళవారం పరిశీలించారు. సీతంపేట, సీతమ్మధార పీఅండ్‌టీ కాలనీ, గురుద్వార, ద్వారకానగర్ తదితర ప్రాంతాల్లోని 42 పోలింగ్ బూత్‌ల్లో పరిస్థితి, సమీప ప్రాంతాలను పరిశీలించారు.ఎన్నికల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పరిశీలించినట్లు సీఐ ఈ సందర్భంగా తెలిపారు.



ద్వారకానగర్ కృష్ణా విద్యామందిరంలో పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐలు

సీఐను మర్యాదపూర్వకంగా కలిసిన జనసేన నాయకులు



సీఐకు పుష్పగుచ్ఛమిస్తున్న నాయకులు

మర్రిపాలెం, జనవరి 30: ఎయిర్‌పోర్ట్ పోలీసుస్టేషన్ సీఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన వి. చక్రధరరావును గ్రేటర్ 53వ వార్డు జనసేన నాయకులు నీరుకొండ దివాకర్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు అల్లి, మురళీ, వి.భాస్కర్, టి.మాణిక్యాలరావు, పాండ్రంగి దివాకర్, సురేశ్, కృష్ణారావు తదితరులు సీఐను కలిసినవారిలో ఉన్నారు.

ఆలిండియా బాక్సింగ్‌లో బుల్లయ్య విద్యార్థిని ప్రతిభ

విశాఖపట్నం (స్పోర్ట్సు), జనవరి 30: అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్ టోర్నీలో బుల్లయ్య కాలేజీ విద్యార్థిని ఎస్‌జీజేఎస్ మల్లిక రజత పతకం సాధించింది. ఈ సందర్భంగా మంగళవారం మల్లికను కాలేజీ కార్యదర్శి, కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వరరావు, జిల్లా బాక్సింగ్ సంఘం కార్యదర్శి బి.అప్పన్నరెడ్డి అభినందించారు. ఫిజికల్ డైరెక్టర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ బీఆర్ఎస్. లక్ష్మణరెడ్డి, యు.గంగా భవానీ పాల్గొన్నారు.



గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేస్తున్న కరణంరెడ్డి, తదితరులు

ఉజ్వల ఉచిత గ్యాస్ కనెక్షన్లు పంపిణీ

గాజువాక, జనవరి 30: దేశంలోని ప్రజలందరూ ఆనందంగా ఉండాలన్నదే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. 64వ వార్డులో ఉజ్వల ఉచిత గ్యాస్ కనెక్షన్లను మంగళవారం పలువురికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రతి పేదవాడు సుఖమైన జీవనంతో ముందుకు సాగాలన్న సంకల్పంతో అనేక సంక్షేమ పథకాలను కేంద్రం ప్రవేశపెడుతుందన్నారు. అయితే కేంద్ర పథకాలను తమవిగా రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వం చలామణి అవుతుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జీలకర్ర రమణ, పేర్ల అప్పారావు, నాయుడు, రాజశేఖర్, స్వామి, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు రిలే నిరాహారదీక్షల కార్యచరణ ప్రకటన

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 30: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న రిలే నిరాహార దీక్షల ఉద్యమ కార్యాచరణను ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు మంగళవారం ప్రకటించారు. ఇందదులో భాగంగా ఫిబ్రవరి ఒకటిన ట్రాఫిక్, కనస్ట్రక్షన్స్, ఆర్ఎండీ, రెండున ఎల్ఎంఎంఎం, ఎస్‌బీఎం, మూడున ఎఫ్ఎండీ, ఈఎండీ, ఈఎస్ఎండీ, ప్లాంట్ డిజైన్, నాలుగున కాంట్రాక్టు కార్మికులు (ఏఐటీయూసీ), ఐదున డబ్ల్యూఆర్ఎం, ఎంఎంఎస్ఎం, ఎస్‌టీఎం, ఆరున ఎంఎంఎస్ఎం, ఎస్‌టీఎం, ఏడున ఎస్ఎంఎస్-1, ఎనిమిదిన సీఎంఎం, సీఆర్ఎంపీ, సీఎంఈ, సీఈడీ, ల్యాబ్ అండ్ హైడ్రా, తొమ్మిదిన కోకో ఓవేన్, పదిన సింటర్‌ప్లాంట్ కార్మికులు, ఉద్యోగులు దీక్షల్లో కూర్చుంటారు. అలాగే 11వ తేదీన కాంట్రాక్టు కార్మికులు (ఇంటక్), 12న బ్లాస్ట్ ఫర్నేస్, 13న ఎస్ఎంఎస్-2, 14న ఎల్ఎంఎంఎం, ఎస్‌బీఎం, 15న ఓటీసీ అసోసియేషన్, 16న ట్రాఫిక్, కనస్ట్రక్షన్స్ ఆర్ఎండీ, 17న ఎంఎంఎస్ఎం, ఎస్‌టీఎం, 18న ఎస్సీ ఎస్టీ అసోసియేషన్, 19న ఇన్‌స్ట్రుమెంటేషన్, క్యూఏటీడీ, డిఎన్‌డబ్ల్యూ, ఆర్అండ్‌డీ, డీఅండ్ఈ, టెలికాం, ఈటీఎల్, డీఎన్‌డబ్ల్యూ, 20న ఈఎస్ అండ్ ఎఫ్, ఆర్ఎస్ అండ్ ఆర్ఎస్, ఈఆర్ఎస్, భద్రత, టెక్‌సెల్, ఎస్ఎస్‌డీ ఉద్యోగులు, కార్మికులు దీక్షల్లో పాల్గొంటారు. 21వ తేదీన ఆగ్రో, ఎస్ఎంఎస్ -1, 22న డబ్ల్యూఎండీ, యుటిలిటీస్, అడ్మిన్, టౌన్ అడ్మిన్, టిటిఐ, 23న టీపీపీ, ఆర్ఈడి, పీఈఎం, స్టోర్స్, ఎస్ఎండి, 24న సింటర్‌ప్లాంట్, 25న కాంట్రాక్టు కార్మికులు (సీఐటీయూ), 26న కోకో-ఓవేన్, 27న బ్లాస్ట్‌ఫర్నేస్, 28న ఆర్ఎంహెచ్‌పి, ఏసీఎస్, హెచ్ఆర్, 29న ఎస్ఎంఎస్-2 ఉద్యోగులు రిలే నిరాహార దీక్షల్లో కూర్చోనున్నారు.

పారిశుధ్య కార్మికునికి గాయాలు

పెదగంట్యాడ, జనవరి 30: పెదగంట్యాడ బీసీ రోడ్డులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పారిశుధ్య కార్మికుడు కామరాజు కాలు విరిగింది. గుర్తు తెలియని వ్యక్తి బైక్‌తో ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. బాధితుడు సీతానగరానికి చెందినవాడు. న్యూపోర్టు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



మాట్లాడుతున్న సీఐ షణ్ముఖరావు

సింధియా, జనవరి 30: రహదారిపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని న్యూపోర్టు సీఐ షణ్ముఖరావు అన్నారు. స్టేషన్ పరిధిలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు మంగళవారం అవగాహన నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకోవాలని, నిబంధనలు అతిక్రమించి ప్రవర్తిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **అయలాన్ :** మెలోడి, కిన్నెర, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక), తాతా (తగరపువలస)
- **కెప్టెన్ మిల్లర్ :** సంగం, వెంకటేశ్వర, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), దుర్గ (మధురవాడ), సప్తగిరి (తగరపువలస), నటరాజ్ (పెందుర్తి)
- **నా సామిరంగ :** శ్రీకన్య, శ్రీలీలామహల్, మౌర్య కన్య-2 (గాజువాక)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శారద, గోకుల్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ, సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), మోహిని కాంప్లెక్స్, లక్ష్మీకాంత్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), రాములమ్మ (తగరపువలస)
- **గుంటూరు కారం :** జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **ఫైటర్ (హిందీ) :** రమాదేవి, కామేశ్వరి,

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 19, టమాటా 24, వంకాయలు (తెలుపు) 18, వంకాయలు (నలుపు) 16, బెండకాయలు 48, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 44, బీరకాయలు 52, ఆనపకాయలు 14, కాలీఫ్లవర్ 16, క్యాబేజ్ 18, క్యారెట్ 18, దొండకాయలు 26, బంగాళా దుంపలు 17, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 74, అల్లం (పాతది) 120, బరబటి 28, ముల్లంగి 18, నిమ్మకాయలు (కిలో) 80, గోరుచిక్కుడు 38, దోస కాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 310, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 46 , ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 28, కాప్సికమ్ 52, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 56, చిలగడదుంపలు 30 , కంద 54, దేముడు చిక్కుడు 32, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120,బూడిదగుమ్మడికాయ 26, క్యాప్సికమ్... క్రపెండలం 20, మామిడి అల్లం 60, బొప్పాయి 34,జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	565
విజయనగరం	569
శ్రీకాకుళం	569

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	100
ఫారం ధర	--	120
విత్ స్కిన్	--	210
స్కిన్‌లెస్	--	220

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 1 లో..

జాతిపితకు ఘన నివాళి



గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న కాంగ్రెస్ నేత జెర్రిపోతుల ముత్యాలు



బాపూజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి రాజశేఖర్, తదితరులు

గాజువాక, జనవరి 30: జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని మంగళవారం పలు ప్రాంతాల్లో నిర్వహించి ఆయనకు నివాళులర్పించారు. ఇందలో భాగంగా గాజువాకలోని టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బాపూజీ చిత్రపటానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, నాయకులు నల్లూరు సూర్యనారాయణ, తదితరులు పూలమల వేసి అంజలి ఘటించారు. అలాగే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ జెర్రిపోతుల ముత్యాలు గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్టీల్‌ప్లాంట్‌లో వైఎస్సార్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్ప గాంధీ చిత్రపటానికి పూలమాల వేశారు.

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు పరిధి కణితిలో వడ్లపూడి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కారుమూరి మహేశ్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. సంఘం ప్రతినిధులు ఎం.వెంకట రమణ, లింగేశ్వరరావు, మధుసూదనశెట్టి, గుప్త, రాజేశ్, గంగరాజు, తదితరులు పాల్గొన్నారు. అలాగే 60 వసంతాల కాళింగులవీధిలోని గాంధీ బొమ్మ సెంటర్‌లో కాలనీ ప్రతినిధులు పి.విజయలక్ష్మి, వేణుబాబు బాపూజీ విగ్రహానికి పుష్పమాల వేసి అంజలి ఘటించారు. సంతమామిడితోటలో కూర్మన్నపాలెం శిష్టకరణాల సంఘం అధ్యక్షుడు గంగవరం గోపి ఆధ్వర్యంలో బాపూజీ వర్ధంతిని నిర్వహించారు.

పెదగంట్యాడ: టీడీపీ మండల కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పులి వెంకటరమణారెడ్డి, ఎం.పెంటయ్య శ్రీముసిరి శ్రీనివాసరావు, జి.ముత్యాలు,ఎం.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు. అలాగే పెదగంట్యాడ, గంగవరం కూడళ్లలో ఇంటక్ ఆధ్వర్యంలో బాపూజీ వర్ధంతిని నిర్వహించారు. ఇంటక్ జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. నాయకులు నీరుకొండ రామచంద్రరావు, జి.ప్రభాకరరెడ్డి, బీఎస్ రాజు, పులి వెంకటరమణారెడ్డి, మంత్రి గోపి, తదితరులు పాల్గొన్నారు. పెదగంట్యాడ గ్రంథాల యంలో జాతిపిత చిత్రపటానికి గ్రంథాలయాధికారి పీవీ రమణ పూలమాల వేసి నివాళులర్పించారు.

అక్కిరెడ్డిపాలెం: మహాత్మాగాంధీ ఆశయాల సాధనకు నేటి యువత కృషి చేయాలని 69 వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి అన్నారు. తుంగ్లాంలో గాంధీ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. కాలనీ నాయకులు కోన అప్పారావు, కొల్లి సత్యం, అచ్చిబాబు, కుంచారావు, మజ్జి రాజు, తదితరులు పాల్గొన్నారు. అలాగే నాతయ్యపాలెంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గవర వెంకటరమణారావు, నాయకులు జి.సన్యాసిరావు, ఎస్.నూకరాజు తదితరులు గాంధీ విగ్రహానికి పూలమాల అంజలి ఘటించారు.

టీడీపీ-జనసేన ప్రభంజనాన్ని ఏ శక్తి అడ్డుకోలేదు

టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

గాజువాక, జనవరి 30: రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన ప్రభంజనాన్ని ఏ శక్తి అడ్డుకోలేదని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఓటమి భయంతో ప్రతిపక్ష పార్టీలపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. చివరకు తన చెల్లిపైనే రాజకీయ దిగజారుడు విమర్శలకు పాల్పడుతున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలను నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. రానున్న ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా టీడీపీ-జనసేన విజయం తథ్యమన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్లు బొండా జగన్, గంధం శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, నాయకులు నల్లూరు సూర్యనారాయణ, పులి వెంకటరణారెడ్డి, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంత లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

దేశ ఆర్థిక వ్యవస్థలతో కేంద్రం దోబూచులాట

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు రామస్వామి



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న రామస్వామి

కూర్మన్నపాలెం, జనవరి 30: దేశ ఆర్థిక వ్యవస్థలతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దోబూచులాట ఆడుతుందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు రామస్వామి అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 1,083వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదానీకి తీర ప్రాంత భూములను కట్టబెట్టాలని బీజేపీ ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తుందన్నారు. రానున్న బడ్జెట్ సమావేశాల్లో ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణపై స్పష్టమైన ప్రకటనను కేంద్రం చేయాలని డిమాండ్ చేశారు. కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్మిక, కర్షక విధానాలను అవలంబిస్తుందని మండిపడ్డారు. దేశంలో ఆంగ్లేయుల పాలనను తలపించేలా మోదీ ముందుకు సాగుతున్నారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను నాశనం చేస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు అన్ని పార్టీలు ఏకతాటిపైకి రావాలన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకునేందుకు తాము ఎలాంటి త్యాగాలకైనా వెనకాడబోమని స్పష్టం చేశారు. నాయకుడు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ దేశానికే గర్వకారణమైన స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయాలనుకోవడం దారుణమన్నారు. పోరాటాల ద్వారా స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేఎస్ఎన్ రావు, మస్తానప్ప, గంగవరం గోపి, వేములపాటి ప్రసాద్, జి.ఆనంద్, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు మూలకు.. నిఘా నియంత్రణ గాలికి..

- పారిశ్రామిక ప్రాంతంలో దుస్థితి
- పరిశ్రమల భద్రతపై ఆందోళన

మల్కాపురం, జనవరి 30: పారిశ్రామిక ప్రాంతంలోని పలు కూడళ్లలో సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. ఎంతో కీలకమైన ఈ ప్రాంతంలో పోలీసు అధికారులు దాదాపుగా అన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. గతంలో అన్నిచోట్లా బాగానే పనిచేసేవి. ఇప్పుడు ఒక్క సీసీ కెమెరా కూడా పనిచేయడం లేదంటే అతిశయోక్తి కాదు. మల్కాపురం పోలీసుస్టేషన్ పరిధిలో ఇండియన్‌నేవీ ప్రధాన కార్యాలయం, నేవల్ డాక్‌యార్డు, కోస్టుగార్డు ప్రధాన కార్యాలయం, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, షిప్‌యార్డు, కోరమాండల్ ఎరువుల కర్మాగారం, భూగర్భంగా గ్యాస్, చమురునిలువల ప్రాజెక్టులున్నాయి.

ఈ ప్రాజెక్ట్‌ల వద్ద ఆయా కంపెనీలు ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు మాత్రమే పనిచేస్తున్నాయి. తప్పా పోలీసులు ఏర్పాటుచేసినవి మాత్రంపనిచేయడం లేదు. కొంతకాలంగా నిర్వహణపై అలసత్వం వల్ల కెమెరాలు మూలకు చేరినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈనేపథ్యం పొరపాటున ఈ ప్రాంతంలో ఏదైనా ఘటన జరిగితే.. సంబంధించి సాక్ష్యాలు ఏ విధంగా సేకరించగలరని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఈస్థితిలో పోలీసు అధికారులు చొరవచూపి సీసీ కెమెరాలు వినియోగంలోకి తీసుకొచ్చేవిధంగా చూడాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.



మల్కాపురంలో పనిచేయని కెమెరా

'తెలుగుదేశంతోనే రాష్ట్రానికి భవిష్యత్తు'



మాట్లాడుతున్న టీడీపీ యువనేత మౌర్యసింహ

మల్కాపురం, జనవరి 30: గ్రేటర్ 58వ వార్డు గొందేశివానిపాలెంలో మంగళవారం సాయంత్రం బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) తనయుడు మౌర్యసింహ హాజరై మాట్లాడారు. రాష్ట్ర భవిష్యత్తు తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. వైసీపీ రాష్ట్రాన్ని అన్నివిధాలుగా నాశనం చేస్తోందని ఆరోపించారు. ఈస్థితిలో టీడీపీ కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు టీడీపీ ప్రధాన కార్యదర్శి పొత్తబత్తుల శ్రీను, నాయకులు నరసింగరావు, రామ్మోహన్‌నాయుడు, గణేష్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యమాంబ ఉత్సవం

పెందుర్తిరూరల్, జనవరి 30: మండలంలోని చింతలఅగ్రహారం పరిసర ఏడుగ్రామాల ప్రజల ఆరాధ్య దేవత సత్యమాం పరస మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు. భక్తు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి పూజలు నిర్వహించారు. సాయంత్రం పరసలో ఏర్పాటు చేసిన బుర్రకథ ప్రదర్శన, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఆధ్యాత్మికవేత్త రవిశంకర్‌కు ఘన స్వాగతం



చిన్న జీయర్ స్వామికి స్వాగతం పలుకుతున్న ఆశ్రమ విద్యార్థులు



విమానాశ్రయంనుంచి వస్తున్న రవిశంకర్ గురూజీ

గోపాలపట్నం, జనవరి 30: గీతం యూనివర్సిటీలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో పాల్గొనడానికి నగరానికి విచ్చేసిన ప్రముఖ ఆధ్యాతికవేత్త రవి శంకర్ గురూజీకి విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. మంగళవారం సాయంత్రం 5.15 గంటలకు ప్రత్యేక విమానంలో హైదరాబాద్ నుంచి విశాఖ చేరుకున్న రవిశంకర్ గురూజీకి విమానాశ్రయంలో పలువురు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో నగరానికి బయలుదేరి వెళ్లారు.

చిన జీయర్ స్వామికి...

శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో జరిగే కార్యక్రమంలో పాల్గొనడానికి నగరానికి విచ్చేసిన వేద గురువు చిన జీయర్ స్వామికి విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. మంగళవారం సాయంత్రం 5.45 గంటలకు హైదారాబాద్ నుంచి విశాఖ చేరుకున్న చిన్న జీయర్ స్వామికి ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో ఇచ్ఛాపురం బయలుదేరి వెళ్లారు.

నేడు శ్రీహరిపురం పరస

మల్కాపురం: శ్రీహరిపురంలో బుధవారం దుర్గామాంబ ఉత్సవం(పరస) జరగనుంది. ఈమేరకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తిచేశారు. శ్రీహరిపురం వీటీ కాలేజీ మార్గంలో ఉన్న దుర్గామాంబ , ముత్యామంబ అమ్మవార్లను పరస సందర్భంగా భక్తులు దర్శనం చేసుకోనున్నారు.

'శాంతిదూత'కు ఘన నివాళి



పెందుర్తిలో గాంధీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న లైబ్రేరియన్, తదితరులు

మల్కాపురం, జనవరి 30: గ్రేటర్ 58వ వార్డు రామ్‌నగర్‌లో మహాత్మాగాంధీ వర్ధంతి కార్యక్రమం హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. ఈసందర్భంగా రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. గాంధీ ఈ దేశానికి ఎంతోమంచిచేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పెందుర్తి, జనవరి 30: స్థానిక గ్రంథాలయంలో మంగళవారం మహాత్మాగాంధీ వర్ధంతి పురస్కరించుకుని ఆవరణలో జాతిపిత విగ్రహానికి పాఠకులు, అతిథులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి సూర్యకళ, విశ్రాంత ఉపాధ్యాయుడు జగదీశ్వరరావు పాల్గొన్నారు.

గాంధీ జీవితం ఆదర్శనీయం

సింధియా: జీవీఎంసీ 40, 62, 63 వార్డులో పలు చోట్ల మంగళవారం గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. 62వ వార్డులో కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు పలు చోట్ల పాల్గొని గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



అభివాదం చేస్తున్న నాన్-జేసీఎం కార్మిక సంఘ నాయకులు

ఉక్కులో ఉద్యోగుల తొలగింపు సరికాదు

నాన్-జేసీఎం కార్మిక సంఘ నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 30: స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగులను తొలగించడం సరికాదని, దీనిపై ప్రధాన కార్మిక సంఘాలు యాజమాన్యాన్ని నిలదీయకుండా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నాయని నాన్-జేసీఎం కార్మిక సంఘ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. గాజువాకలో మంగళవారం జరిగిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని ప్రకటించి మూడేళ్లు దాటిందని, కార్మిక సంఘాలు పెద్దఎత్తున పోరాటాలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ప్లాంట్‌లో ఒక్కో విభాగాన్ని ప్రైవేటీకరణ చేస్తున్నారని, కార్మికుల సంఖ్య కూడా తక్కువగా ఉందని, నిర్వాసితులు కోటా ఇవ్వడం లేదని వాపోయారు. ఆయా అంశాలపై మిగతా కార్మిక సంఘాల తరపున ప్రశ్నిస్తే నిందలు వేస్తున్నారని పేర్కొన్నారు. కార్మికుల ఆర్థిక ప్రయోజనాలపై సంఘాలు ఏమీ చేయకపోవడంతో కార్మిక వర్గం తీవ్ర అసంతృప్తితో ఉందన్నారు. ఈ సమావేశంలో నాయకులు జి.గణపతిరెడ్డి, కొమ్మినేని శ్రీనివాసరావు, నక్కా వెంకటరమణ, డీవీ రమణారెడ్డి, జి.నరేంద్ర, మహాలక్ష్మినాయుడు, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

నెలలు నిండని శిశువుకు అరుదైన శస్త్ర చికిత్స



శస్త్ర చికిత్స జరిగిన చిన్నారితో వైద్యులు, తల్లిదండ్రులు

అక్కిరెడ్డిపాలెం, జనవరి 30: నెలలు నిండకుండా తక్కువ బరువుతో జన్మించిన నవజాత శిశువుకు అత్యంత కష్టమైన గుండె శస్త్ర చికిత్స చేసి షీలానగర్ కిమ్స్ ఐకాన్ వైద్య బృందంపు నర్జన్మనిచ్చారు. అత్యంత అరుదైన ఈ శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేసినట్టు కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి ఎండి డాక్టర్ పి.సతీశ్‌కుమార్ తెలిపారు. నగరంలోని అక్కయ్యపాలేనికి చెందిన గణేశ్ కుమార్ భార్య రేవతికి ఈ నెల రెండున నగరంలోని ఓ ఆస్పత్రిలో నెలలు నిండకుండా (32 వారాలకే) ఇద్దరు కవలలు పుట్టారు. కేవలం 1.3 కిలోల బరువున్న ఈ శిశువుల్లో ఒకరు శ్వాస సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఉన్నట్టు చిన్నపిల్లల వైద్యులు ఎస్‌గణేశ్‌కుమార్ గుర్తించి షీలానగర్ కిమ్స్ ఆస్పత్రి కార్డియాలజిస్టు డాక్టర్ శాంతిప్రియను సంప్రదించారు. శిశువును పరీక్షించిన ఆమె శస్త్ర చికిత్స అవసరమని గుర్తించారు. కేవలం పది రోజుల శిశువుకు గుండె ఆపరేషన్ చేయడం సంక్లిష్టం కాబట్టి ఆస్పత్రి వైద్య బృందం హైదరాబాద్ కిమ్స్ ఐకాన్ కార్డియాలజిస్టు డాక్టర్ డి.అనిల్‌కుమార్‌ను సంప్రదించారు. దీంతో ఆయన ఇక్కడి వైద్యులు శాంతిప్రియ, నిఖిల్, సాయి మణికంఠ, తదితరులతో కలిసి ఆ శిశువుకు విజయవంతంగా శస్త్ర చికిత్సను పూర్తి చేశారు. ప్రస్తుతం శిశువు ఆరోగ్యంగా ఉన్నట్టు డాక్టర్ సతీశ్‌కుమార్ తెలిపారు. తమ కుమార్తెకు కిమ్స్ ఆస్పత్రి వైద్యులు పునర్జన్మనిచ్చారని గణేశ్‌కుమార్, రేవతి దంపతులు ఆనందం వ్యక్తం చేశారు.

వైఎస్సార్ బీమా తక్షణసాయం అందజేత

పెదగంట్యాడ, జనవరి 30: జీవీఎంసీ 65వ వార్డు పరిధి ప్రియదర్శినీ కాలనీకి చెందిన దినసరికూలీ సమ్మిడి దుర్గారావు ఇటీవల అకాలమృతి చెందాడు. ఆకుటుంబానికి వైఎస్సార్ బీమా లక్షల రూపాయలు మంజూరు అయ్యింది. తక్షణసాయగా పదివేల రూపాయలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మొత్తాన్ని వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు మృతుని భార్య వెంకటలక్ష్మికి మంగళవారం అందజేశారు. సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీ శశిభూషణ్, వాలంటీర్ సామోజు దేవి, స్థానిక నాయకులు అవంతి, ఆకుల మోహిని సమక్షంలో ఈ మొత్తాన్ని అందజేశారు.

ఆర్టీసీ కార్మికుల అరెస్టు అన్యాయం: ఎన్ఎంయూ



సింహాచలం డిపో ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

వేపగుంట జనవరి 30: సమస్యలపై ఆందోళన చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగుల అక్రమంగా అరెస్టు చేయడం దారుణమని ఎన్ఎంయూ నాయకులు అన్నారు. ఎన్ఎంయూ జోనల్ కమిటీ పిలుపు మేరకు సింహాచలం డిపోలో కార్మికులు గేటు మీటింగ్ ధర్నా మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గత 13 రోజులుగా కార్మికుల నిరసన దీక్షలు చేస్తున్నా విశాఖ డీపీటీవో కనీస చొరవ చూపకుండా వ్యవహరించటం అన్యాయమన్నారు. కార్మికులకు అన్ని సిక్‌లపై జీతాలు , ఏఎస్ఎస్‌లు వెంటనే కలపాలని డిమాండ్ చేశారు. 2019 ఒకటో తేదీన ఇచ్చిన సర్క్యులర్‌ను అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపో అధ్యక్ష కార్యదర్శులు డి.ఎ.నాయుడు, జె.ఎస్.ఎన్.రాజు, వర్కింగ్ అధ్యక్షుడు టి.ఎన్.రావు, గ్యారేజీ కార్యదర్శి బి.ఎస్.రాజు, క్యాషియర్ జి.ఎ.రావు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



గంగిరెడ్డి కాలనీలో షెడ్‌ను తొలగిస్తున్న రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

వేపగుంట జనవరి 30: జీవీఎంసీ 94వ వార్డు వేపగుంట దరి గంగిరెడ్డి కాలనీలో పాఠశాలకు కేటాయించిన స్థలంలో ఆక్రమణలను మంగళవారం అధికారులు తొలగించారు. కాలనీలో 2007లో ప్రాథమిక పాఠశాల అవసరాల కోసం అప్పటి కార్పొరేటర్ రాపర్తి కన్నా శైలజ ఈ స్థలాన్ని కేటాయించారు. వంటశాల, విద్యార్థులకు ఉపయోగంగా ఉంటుందని భావించారు. ఇటీవల కొంతమంది నకిలీ పట్టాలను చూపి ఈ స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించారు. దీనిపై వేపగుంట గ్రామ బేడ జంగం హక్కుల పోరాట సమితి, గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. అలాగే, మంగళవారం మరోమారు ఇక్కడ షెడ్ నిర్మాణానికి ఆక్రమదారులు ప్రయత్నించడంతో రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది గుర్తించి వీటిని తొలగించారు. వెంటనే ఈస్థలంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

'జనసేన బలోపేతానికి కృషి'



కొణతాలను కలిసిన పెందుర్తి జనసేన నాయకులు

వేపగుంట జనవరి 30: సీనియర్ నాయకులు కొణతాల రామకృష్ణను జీవీఎంసీ 88, 94,95వ వార్డులకు సంబంధించిన నాయకులు పెందుర్తి మాజీ ఎంపీపీ కంచి పాటివిశ్వనాథ నాయుడు ఆధ్వర్యం లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జనసేన నాయకులను కొణతాలకు పరిచయం చేశారు. పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. త్వరలో జిల్లాని అన్నిప్రాంతాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి పార్టీబలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేన వార్డు అధ్యక్షులు పబ్బిన జనార్దన్, పిన్నింటి పార్వతి, కంచిపాటి మధు, జుత్తాడ శ్రీనివాసరావు, మెండా సతీశ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

'గంటా'తో అనిత భేటీ



గంటాతో మాట్లాడుతున్న అనిత

అక్కయ్యపాలెం, జనవరి 30: మాజీ మంత్రి, ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో మంగళవారం తెలుగు మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. రానున్న రోజుల్లో రాజకీయ, పార్టీ పరంగా సహాయ సహకారాలు అందించాలని ఆమె కోరారు. ఎన్నికలు దృష్ట్యా టీడీపీ నాయకులు, కార్యకర్తలు అహర్నిశలు కృషి చేసి జనసేన, టీడీపీల ఉమ్మడి గెలుపునకు కృషి చేయాలనిఈసందర్భంగా గంటా సూచించారు.

ఉత్తరాంధ్ర స్థాయి బాక్సింగ్ పోటీలు ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న అతిథి వెంకటరావు

అక్కయ్యపాలెం, జనవరి 30: సిటీ బాక్సింగ్ క్లబ్ ఆధ్వర్యంలో కైలాసపురం మధుసూదన్‌నగర్‌లో ఉత్తరాంధ్ర బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీలను వీఎస్పీకేపీ సీపీఐఆర్‌యూడీఏ చైర్మన్‌న చొక్కాకుల వెంకటరావు మంగళవారం ప్రారంభించారు. విశాఖపట్నం పోర్టు అథారిటీ యూనియన్ నాయకుడు గొర్లె చందు, ఇంటర్నేషనల్ అవెంజనీస్ ప్రతినిధి పి. రాజేష్, విజయ్‌కుమార్, వీఎస్ విశాఖ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యల్లపు రఘురాం, జనరల్ సెక్రటరీ వాసుపల్లి అమ్మోరు, ఆర్వోసీ వి.రూబెన్, సీనియర్ రిఫరి టీపీఎస్‌ఎన్ అనిల్ కుమార్, డి.కనకరాజు పాల్గొన్నారు.

బీసీ చైతన్య వేదిక నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

మహారాణిపేట, జనవరి 30: మహారాణిపేటలోని బీసీ చైతన్య వేదిక కార్యాలయంలో పలువురు ప్రముఖులు మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్షుడిగా పెదపెంకి శివ ప్రసాదరావు, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడిగా దాసరి జ్ఞాన మూర్తి, అనకాపల్లి జిల్లాఅధ్యక్షుడిగా ఎస్‌వీవీ రామచంద్రరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పలువురు నూతన కమిటీ సభ్యులుగా నియమితులయ్యారు. ఈసందర్భంగా శివ ప్రసాదరావు మాట్లాడుతూ ఇంతవరకు బీసీలకు చట్ట సభల్లో ప్రాతి నిధ్యంలేదన్నారు. ఇకపై సమష్టిగా తమ సత్తా చాటుతామన్నారు. వివిధ సామాజిక వర్గాలకు చెందిన నాయకుల ఉండవల్లి శ్రీని వాసరావు, వడ్లపూడి ఈశ్వరరావు, ఆతవ సుబ్బారావు, అనసూయ, వైవీ రమణమూర్తి, రామచంద్రరావు, రమేష్, సాయి కుమార్, తదితరులు పాల్గొన్నారు. జననాయక్ కర్పూరి ఠాగూర్‌కు కేంద్ర ప్రభుత్వం భారత రత్న ప్రకటించడంపై హర్షం వ్యక్తంచేశారు.

లోకోషెడ్ పరిశీలన

విశాఖపట్నం, జనవరి 30: రైలే డీఆర్‌ఎం సౌరబ్ ప్రసాద్ ఎలక్ట్రికల్ లోకోషెడ్‌లో మంగళవారం పర్యటించారు.లోకో ఎగ్జామినేషన్ పాయింట్లుతోపాటు అక్కడ జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు.



మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్సు పార్కులో విగ్రహానికి నివాళులర్పిస్తున్న సభ్యులు



గాంధీజీ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న జనసేన నాయకులు

జాతిపిత ఆశయాలు అనుసరణీయం

» వాడవాడలా మహాత్మునికి వర్ధంతి

డాబాగార్డెన్స్, జనవరి 30: అహింస, సత్యాగ్రహం ఆయుధాలుగా అఖండ భారతావనికి స్వేచ్ఛను ప్రసాదించిన మహా నాయకుడు జాతిపిత మహాత్మా గాంధీ అని వక్తలు కొనియాడారు. గాంధీ 76వ వర్ధంతి సందర్భంగా మాజీ పార్లమెంట్ సభ్యులు కొణతాల రామకృష్ణ, 22వ వార్డు కార్పొరేటర్ పీతలమూర్తియాదవ్ , చలసాని గాంధీ, కిరణ్‌ప్రసాద్, నాగలక్ష్మి చౌదరి, త్రివేణి, శారిణీదేవి, ధనలక్ష్మి, పోతు వెంకటప్రసాద్, చంద్రశేఖర్ గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ, సమస్త విశ్వానికి శాంతి సందేశం ప్రబోధించిన మహనీయులు జాతిపిత అని అన్నారు.

ఛాయా చిత్రాల ప్రదర్శన

డాబాగార్డెన్స్: అహింస ఉత్సవాలను అఖిల భారత సర్వోదయ సంస్థల ఆధ్వర్యంలో రామకృష్ణాబీచ్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్వోదయ సంఘం విశాఖ అధ్యక్షులు డా.విజయ్‌చంద్ర, ప్రముఖ గాంధేయవాది జుబెరుల్లఖాన్, విశాంత్ర ఆచార్యులు కోటి జాన్ , వివిధ పార్టీల నేతలు హాజరయ్యారు. విశాంత్ర ఆచార్యుడు జీకే సుబ్రహ్మణ్యం గాంధీజీ ఛాయచిత్రాల ప్రదర్శన నిర్వహించారు. క్విట్ ఇండియా, స్వరాజ్య సమర ఘట్టాలను ఛాయాచిత్రాల ద్వారా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పర్యాటకులు పాల్గొన్నారు.

మహాత్ముని ఆశయ సాధనకు పనిచేయాలి



గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సర్వోదయ సంఘం ప్రతినిధులు

పూర్ణామార్కెట్: మహాత్మాగాంధీ ఆశయసాధన కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలని బ్రహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్, దక్షిణ నియోజకవర్గ సీనియర్ నాయకుడు సీతంరాజు సుధాకర్ పేర్కొన్నారు. మంగళవారం 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భగా మాట్లాడుతూ స్వాతంత్ర్య సాధన కోసం గాంధీ మహాత్ముడు అనుసరించిన మార్గం అందరికీ ఆదర్శమని అన్నారు.

వైశాఖీ స్పోర్ట్సు పార్కులో ..

మురళీనగర్; మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్సు పార్కులో మంగళవారం గాంధీజీ వర్ధంతి సందర్భంగా అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. పార్కు కమిటీ అధ్యక్షులు సనపల.వరప్రసాద్ ఆధ్వర్యంలో పార్కు ప్రాంగణంలోని గాంధీజీ విగ్రహానికి కమిటీ సభ్యులు, వనిత వాకర్స్ సభ్యులు నివాళులర్పించారు. పార్కు కమిటీ కార్యదర్శి పి.నాగరాజు, వనితా వాకర్స్ క్లబ్ మహిళలు సభలో ఉన్నారు. మురళీనగర్ వాకర్స్ క్లబ్‌లో అధ్యక్షులు పల్లా. చంద్రమౌళి నేతృత్వంలో గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. వాకర్స్ క్లబ్ జిల్లా ప్రతినిధులు ద్వారకానాధ్, క్లబ్ పూర్వ కమిటీ సభ్యులు సీహెచ్ కృష్ణమూర్తి ఉన్నారు.

జ్ఞానాపురం: గ్రేటర్ 32వ వార్డులోని జనసేనపార్టీ కార్యాలయంలో కార్పొరేటర్ కందుల నాగరాజు ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం ప్రమాదంలో గాయపడిన ఆటోడ్రైవర్ కుటుంబానికి నిత్యవసరసరకులు అందజేశారు. 33వ వార్డు పరిధిలోని నీలమ్మచెట్టు ఆలయ ట్రస్ట్ చైర్మన్ బొర్రా విజయలక్ష్మి, బొర్రాశ్రీనివాసరెడ్డి అల్లిపురంలోని గాంధీ విగ్రహంవద్ద నివాళులర్పించారు. జ్ఞానాపురంలో వార్డు కార్పొరేటర్ కోడిగుడ్లపూర్ణిమ, శ్రీధర్ నివాళులు అర్పించారు. సెయింట్ జోసెఫ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ పీవో డా.మాణిక్యకుమారి ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతి నిర్వహించారు. ప్రిన్సిపాల్ డా.సిస్టర్ షైజీ పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం: గ్రేటర్ 46వ వార్డు కస్తూరినగర్‌లో సిద్ధి వినాయక సేవా సంఘం ఏర్పాటు చేసిన జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి జనసేన పార్టీ ఉత్తర నియోజకవర్గం ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్ నివాళులర్పించారు. నాయకులు శ్రీను, చలపతిరావు, శంకర్, సతీష్, శివారెడ్డి, దామోదర్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో నివాళి..

మహారాణిపేట: జాతిపిత మహాత్మా గాంధీ దేశానికి చేసిన సేవలు ఎనలేనివని జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్ కొనియాడారు. గాంధీ వ ర్ధంతి సందర్భంగా కాలెక్టరేట్ పార్కులోని వి గ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గాంధీ తోనే దేశానికి స్వేచ్ఛాస్వాతం త్ర్యం వచ్చిందన్నారు. ఆయన దేశం కోసం ప్రాణాలర్పించారన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో కె. మోహన్‌కుమార్, ఏవో ఈశ్వరరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అమరవీరుల దినోత్సవం

విశాఖపట్నం: వాల్తేరు డివిజన్‌లో మంగళవారం అమరవీరుల దినోత్సవం జరిగింది. ఈసందర్భంగా డీఆర్‌ఎం సౌరబ్‌ప్రసాద్‌తోపాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొని రెండు నిమిషాలపాటు మౌనం పాటించి స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పిం చారు. స్వాతంత్య పోరాటంలో త్యాగం చేసిన వారికి గుర్తుగా ఏటా జనవరి 30న షహీద్ దివస్ నిర్వహిస్తారని పేర్కొన్నారు.



స్వాతంత్ర్య యోధులకు నివాళులర్పిస్తున్న రైల్వే అధికారులు

'ముస్లింలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి'

మహారాణిపేట, జనవరి 30: ఉత్తరాంధ్ర జిల్లాలో గత 30 ఏళ్లుగా రాజకీయ ప్రాతి నిధ్యం లేని ముస్లిం మైనారిటీ వర్గాలకు ఈసారి ఎన్నికల్లోనైనా న్యాయం చేయాలని విశాఖ జిల్లా ముస్లిం మైనారిటీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును వారు మర్యాదపూర్వకంగా కలసి వినతి పత్రాన్ని అందించారు. అనంతరం సీనియర్ ముస్లిం మైనారిటీ నాయకుడు అబ్దుల్ చిన రహమాన్ మాట్లాడుతూ.. ఉత్తరాంధ్ర జి ల్లాలోని 34 అసెంబ్లీ నియో జకవర్గాలలో ముస్లిం ఓటర్లు ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయగల స్థాయిలో ఉన్నారన్నారు. అయినా, 1994 నుంచి మూడు జిల్లాల్లో ముస్లింలకు ఎటువంటి అవకాశం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈసారి తమ సామాజిక వర్గానికి టికెట్టు కేటాయిస్తే శాతశాతం గెలిపించుకుం టామన్నారు. పల్లా ఈ విషయం అధిష్టాన వర్గం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చూస్తానన్నారు. ముస్లిం నాయకులు మహ్మద్ జఫ్రుల్లా, మహ్మద్ సలీమ్, షేక్ బాజ్జీ, షేక్ కాలేషా, షేక్ రహ్మతల్లా , గౌస్ , రఫీ, సయ్యద్ హుస్సేన్, యాసిన్, తానూజ, ఆజీ జ్, రహీమ్, రబ్బానీ, అహ్మద్, నౌషద్ పాల్గొన్నారు.



టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లాకు వినతి పత్రాన్ని అందిస్తున్న ముస్లిం నాయకులు

మొక్కుబడిగా ప్లాస్టిక్ నిషేధం

... 5వ పేజీ తరువాయి

నిషేధించింది. నిషేధం అమలు కావాలంటే ప్రజల్లో చైతన్యం అవసరమని గుర్తించిన అధికారులు అప్పటి నుంచి నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. మొదట వినియోగదారులు, వ్యాపారులకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలుపై కౌన్సెలింగ్ చేసి, తర్వాత కేసులు నమోదు, జరిమానాలు విధించడం మొదలుపెట్టారు. లక్ష్మీషా కమిషనర్‌గా ఉన్నప్పుడు ప్లాస్టిక్ నిషేధం పక్కాగా అమలు కావడంతో ప్రత్యామ్నాయాలపై వ్యాపారులు, ప్రజలు దృష్టిసారించారు. కమిషనర్, మేయర్‌తోపాటు జీవీఎంసీ అధికారులు, ఎన్‌జీవోలు, స్వచ్ఛభారత్ బ్రాండ్ అంబాసిడర్లు కలిసి మార్కెట్లు, రైతుబజార్లు, వీధివర్తకుల వద్దకు వెళ్లి ప్లాస్టిక్ సంచులకు బదులు గుడ్డ, నారసంచులను వాడాలని అవగాహన కల్పించారు. దీంతో ప్లాస్టిక్ వినియోగం గణనీయంగా తగ్గింది. అయితే లక్ష్మీషా తరువాత వచ్చిన కమిషనర్లు ప్లాస్టిక్ నిషేధంపై నిర్లక్ష్యం వహించడంతో మళ్లీ వినియోగం పెరిగిపోయింది. దీనిపై తీవ్రస్థాయిలో విమర్శలు రావడంతో జీవీఎంసీ పరిధిలో వార్డు వలంటీర్లుగా పనిచేస్తున్న 30 మందిని ప్లాస్టిక్ నియంత్రణకు ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలుగా ఏర్పాటుచేశారు. ముగ్గురి చొప్పున ఒక బృందంగా ఏర్పాటుచేసి వారికి ప్రత్యేకంగా యూనిఫారం, ఒక వాహనాన్ని సమకూర్చారు. ప్రతీరోజూ వారు తమకు కేటాయించిన ప్రాంతాల్లో తిరుగుతూ సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ విక్రయించే దుకాణాలపై దాడులు చేసి, జరిమానాలు విధిస్తున్నారు.

చిరు వ్యాపారులపైనే ప్రతాపం

ప్లాస్టిక్ నిషేధం అమలుకోసం ఏర్పాటుచేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు వీధివ్యాపారులు, రోడ్లపక్కనే తోపుడు బండ్లపై వ్యాపారం చేసేవారిపైనే ప్రతాపం చూపుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్లాస్టిక్ తయారుచేసే యూనిట్లు, ఇతర ప్రాంతాల నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు నగరానికి దిగుమతి చేసుకుని, రిటైల్ వ్యాపారులకు విక్రయించే హోల్‌సేల్ ట్రేడర్లను వదిలేసి, చిరు వ్యాపారులపై కేసులు నమోదుచేయడం వల్ల ఉపయోగం ఏముంటుందని నగరవాసులు ప్రశ్నిస్తున్నారు. జీవీఎంసీ పరిధిలో 153 మంది హోల్‌సేల్ ట్రేడర్లు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. వీరిలో ఇద్దరు భీమిలి జోన్, 15 మంది అనకాపల్లి జోన్‌లో ఉండగా మిగిలిన వారంతా నగరంలోనే ఉంటున్నారు. అధికారులకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే అలాంటి వారిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ నిరంతర నిఘా ఉంచి, ప్లాస్టిక్‌ను దిగుమతి చేసుకుంటే కేసులు నమోదుచేసి, భారీగా జరిమానాలు విధించాలని సూచిస్తున్నారు. అప్పుడే నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగానికి అడ్డుకట్టపడుతుందని అభిప్రాయపడుతున్నారు. కాగా, నగరంలో ఉత్పత్తి అవుతున్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రీసైక్లింగ్‌కు పదమూడు యూనిట్లు ఏర్పాటుచేశారు. అయితే ప్రతిరోజూ సుమారు 150 టన్నులు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తి అవుతుంటే అందులో 50-70 టన్నులు మాత్రమే రీసైక్లింగ్ చేయగలుగుతున్నారు. మిగిలిన ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రంలోనూ, భూమిలో కలిసిపోతున్నాయి.

ఫిల్మ్ క్లబ్ ఎన్నికలు వాయిదా

... 5వ పేజీ తరువాయి

ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చే అవకాశం లేదని తేల్చేశారు. అయితే ఎక్కడో ఓ చోట అడుగుతామని హామీ ఇచ్చారు. ప్రస్తుతానికి క్లబ్ సొమ్ముతో భూమి కొనే ప్రతిపాదనను పక్కన పెట్టాలని తీర్మానం చేయాలని సభ్యులు కోరారు. ఏ నిర్ణయం తీసుకోకుండానే సమావేశం ముగించారు. క్లబ్ ఎన్నికల తరువాత ఏర్పడే కొత్త కార్యవర్గం అన్నీ చర్చించి నిర్ణయాలు తీసుకుంటుందని, ఇంకో రెండు నెలల్లో దిగిపోయే కార్యవర్గం కీలక నిర్ణయాలు తీసుకోవడం తగదని పలువురు అభిప్రాయపడడంతో వైసీపీ అనుకూల బృందం మిన్నకుండిపోయింది.

నిరుపేద కుటుంబాల్లో మద్యం చిచ్చు

... 5వ పేజీ తరువాయి

చెప్పారు. తాగుడుకు దూరంగా ఉండకపోతే ప్రమాదమని హెచ్చరించారు.

ఆదాయంలో సగానికిపైగా మందుకే...

శ్రీకాకుళం జిల్లాకు చెందిన బాలకృష్ణ పదిహేనేళ్ల కిందట ఉపాధి నిమిత్తం విశాఖ వచ్చాడు. ఇసుకతోటలో నివాసం ఉంటూ పెయింటింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. నగరానికి వచ్చే నాటికి మద్యం అలవాటు ఉంది. ప్రతిరోజూ పనికి వెళ్లి వచ్చిన తరువాత ఒక సీసా కొనుగోలు చేసి ఇంటికి వచ్చి తాగి, తిని పడుకునేవాడు. మిగిలిన మొత్తాన్ని భార్యకు ఇచ్చేవాడు. కానీ, గడిచిన మూడున్నరేళ్ల నుంచి మద్యానికి పూర్తిగా బానిసగా మారాడు. ఉదయాన్నే పనికి వెళ్లడం, రాత్రికి ఎప్పుడో పూటుగా తాగి ఇంటికి రావడం పరిపాటిగా మారింది. ఒక్కోరోజు ఇంటికి కూడా రాకుండా ఆ షాపు బయట నిద్రపోతున్నాడు. పదేళ్ల వయసున్న ఇద్దరు పిల్లలతో అతడి భార్య బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తోంది. ఏం చేయాలో, ఎవరికి చెప్పాలో కూడా తెలియక తీవ్రంగా మథనపడుతోంది. కుటుంబ సభ్యులు చెప్పినా అతడిలో మార్పు రాలేదు. గతంతో పోలిస్తే ప్రస్తుతం విక్రయిస్తున్న మద్యం కిక్ ఇవ్వడం లేదని, తాగుతున్న ఫీలింగ్ రాకపోవడం వల్లే ఇంకా తాగాలనిపిస్తోందని హెచ్‌బీ కాలనీలో ఉంటూ బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్న రవి తెలిపాడు. గతంలో బీర్ తాగే అలవాటు ఉండేదని, ఇప్పుడు అన్నింటికీ అలవాటు పడిపోయానని, బయట పడేందుకు చేస్తున్న ప్రయత్నాలు విఫలమవుతున్నట్టు ఆవేదన వ్యక్తంచేశాడు. ఇటువంటి వాళ్ల సంఖ్య గడిచిన కొద్దికాలంగా పెరిగింది. ఆదాయంలో సగానికి మించి, పూర్తిగా కూడా మందుకే ఖర్చు పెడుతున్న వారి సంఖ్య పెరిగింది. రోజువారీ కూలికి వెళ్లి ఆదాయం తెచ్చుకునే ఎంతోమంది కుటుంబాల్లో ఇదే పరిస్థితి ఉంది. రోజు కూలికి వెళితే ఐదు వందలు నుంచి ఏడు వందల రూపాయల వరకు వస్తే..అందులో మూడు, నాలుగు వందలు మద్యానికే ఖర్చు చేసేస్తున్నారు. దీంతో కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడుతున్నారు.

తాగాలనిపిస్తుండడం వల్లే...

ఈ మధ్య కాలంలో తాగుడుకు బానిసలుగా మారిన వారి సంఖ్య పెరుగుతున్నట్టు మానసిక వైద్యులు చెబుతున్నారు. గతంలో కాస్తో, కూస్తో తాగేవారని, ఇప్పుడు పరిధికి మించి తాగుతూ ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తున్నారంటూ మద్యానికి బానిసైన వారిని కుటుంబ సభ్యులు మానసిక వైద్యుల వద్దకు తీసుకువెళుతున్నారు. ప్రతి పది కేసుల్లో కనీసం నాలుగు అవే ఉంటున్నాయని ప్రముఖ మానసిక వైద్య నిపుణులు ఎన్ఎన్ నిహాల్ తెలిపారు. కొంతమంది ఉదయం మొదలుపెట్టి రాత్రి పడుకునేంత వరకు తాగుతూనే ఉంటున్నారని, అటువంటి వారికి శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఆరోగ్యం దెబ్బతింటుందని ఆయన వెల్లడించారు.

వైసీపీలో తెరపైకి కొత్తపేర్లు

... 5వ పేజీ తరువాయి

పార్టీ అధిష్ఠానం స్పష్టంచేసినట్టు పార్టీ నేతలు బహిరంగంగానే చెబుతున్నారు. ఆయన స్థానంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు లేదా ఆదీప్‌రాజ్ సామాజిక వర్గానికే చెందిన వారికే టికెట్ ఇవ్వాలని భావిస్తున్నట్టు తెలిసింది. పీసీపీఐఆర్ చైర్మన్ చొక్కాకుల వెంకటరావు పేరును పరిగణనలోకి తీసుకుని సర్వే చేయిస్తున్నట్టు పార్టీ నేతలు చెబుతున్నారు. మరోవైపు మారిటైమ్ బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి కూడా వచ్చే ఎన్నికల్లో ఏదో ఒకచోట నుంచి పోటీ చేయాలని భావిస్తున్నారు. ఆయన ఉత్తరం సీటు కోరుకుంటున్నట్టు ప్రచారం జరుగుతోంది.

విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు



విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేస్తున్న గాయత్రి కాలేజీ వైద్యులు

పూర్ణామార్కెట్, జనవరి 30: వన్ టౌన్‌లోని క్వీన్‌మేరీ గర్ల్స్ హైస్కూల్ ఆవరణలో వేదాంత గూడ్స్ కార్గో, ఎఫ్ఎక్స్‌బీ ఇండియా సురక్ష (ఎన్‌జీవో) సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రదానోపాధ్యాయుడు వి.జోగేంద్రనాద్ ఈ శిబి రాన్ని ప్రారంభించారు. గాయత్రి మెడికల్ కాలేజీ వైద్యులు 189 విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులు పంపిణీ చేశారు. వేదాంత గూడ్స్ కార్గో బర్త్ ప్రైవేట్ లిమిటెడ్ సీఆర్ఎస్ మేనేజర్ సి.ఎస్. శ్రీలక్ష్మి, ఎఫ్ఎక్స్‌బి సురక్ష ప్రాజెక్టు మేనేజర్ వై.అశోక్‌కుమార్ పర్యవేక్షించారు.వైద్యులు పల్లవి, డి.చంద్రకళ, టీడీ హెల్త్‌విజిటర్ ఎస్.ఉషా, కె.గోపి (ఎస్‌టీఎల్‌ఎస్) టి.శ్రీదేవి (ఎస్‌టిఎస్) ఎఫ్ఎక్స్ కు చెందిన టి.సునీత, కె.రాయతి పాల్గొన్నారు.

అయ్యన్నను కలిసిన విల్లూరి దంపతులు

అల్లిపురం, జనవరి 30: తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్న పాత్రుడిని టీడీపీ విశాఖ పార్లమెంట్ పార్టీ ఉపాధ్యక్షుడు విల్లూరి డాక్టర్ చక్రవర్తి, 33వ వార్డు టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి విల్లూరి తిరుమలదేవి మంగళవారం నగరంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలసి శాలువతో సత్కరించారు. పార్టీకి వారు చేస్తున్న కార్యక్రమాలను వివరించారు.

జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అప్పులపాలు

» టీడీపీ దక్షిణ ఇన్‌చార్జి గండి బాబ్జీ

అల్లిపురం, జనవరి 30: ముఖ్యమంత్రి జగన్ రెడ్డి పాలనలో రాష్ట్రం రూ. 13 లక్షల కోట్ల అప్పుల్లో కూరుకుపోయిందని తెలుగుదేశం పార్టీ దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ ఆందోళన వ్యక్తంచేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రా కదలిరా పిలుపు ద్వారా ప్రతిపక్షనేత చంద్రబాబు.. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ నెలరోజులుగా అవిశ్రాంతంగా పోరాడుతున్నారు. టీడీపీకి 5కోట్ల మంది ప్రజలు స్టార్ క్యాంపెనర్లుగా మద్దతు తెలుపుతున్నారన్నారు. రాష్ట్రంలో నేరాల శాతం బాగా పెరిగినట్టు నేషనల్ క్రైమ్ నివేదికలు సూచిస్తున్నాయన్నారు. మహిళలపై నేరాల్లో ఏపీ 6వ స్థానంలో ఉందని అన్నారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే రైతులపై రుణభారం ఏపీలోనే ఎక్కువగా ఉందన్నారు. గతంలో ముఖ్యమంత్రి జగన్ వైనాట్ 175 ధీమా వ్యక్తంచేశారని, ఇప్పుడు ఓడిపోయినాతప్పులేదన్న స్థితికి రావడం గమనించదగిన అంశమన్నారు. ప్రజలు ఆయనకు గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

ముగిసిన క్రికెట్ పోటీలు



విజేతలతో అతిథులు

అక్కయ్యపాలెం, జనవరి 30: ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్స్ వీడియోగ్రాఫర్స్ విశాఖ సంఘం ఆధ్వర్యంలో గత నాలుగురోజులుగా పోర్టు స్టేడియంలో జరుగుతున్న ఫౌండర్స్ నైన్ క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో 8 జట్లు పోటీపడ్డాయి. ఫౌండర్స్ నైన్ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా డ్రాగన్స్ వారియర్స్ జట్టు నిలిచింది. విజేతలకు సంఘం చైర్మన్ ఎన్‌వీఎస్ఎస్ ప్రసాద్, అధ్యక్షుడు సీహెచ్ మధు, అడ్వయిజర్లు టీవీఆర్ఎం రాజు, ఎం.విజయ్, సిమ్మా మధు బహుమతులు ప్రదానం చేశారు.

గాయని సాహితీకి వేటూరి పురస్కారం



సాహితీకి పురస్కారం ప్రదానం చేస్తున్న మాజీమంత్రి గంటా, తదితరులు

డాబాగార్డెన్స్, జనవరి 30: వర్ధమాన సినీ నేపథ్య గాయని సాహితీకి వేటూరి యువ గాయని పురస్కారం ప్రదానం చేయడం అభినందనీయమని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం రాత్రి డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సినీ గేయ రచయిత వేటూరి సుందర రామ్మూర్తి 98వ జయంతిని ఆత్రేయ స్మారక కళాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలుగు పదానికి జానపదం... వేణువై వచ్చాను..భువనానికి..రాలిపోయే పువ్వా నీకు వర్ణాలెందుకే వంటి గీతాలతో తెలుగు ప్రజల గుండెల్లో వేటూరి నిలిచిపోయారన్నారు. ఆయన పేరిట పురస్కారం సాహితికి అందించారు. అనంతరం శంబర జోగారావు సారథ్యంలో సంగీత విభావరి జరిగింది. సాహితీ, రమేష్ పట్నాయక్ పాడిన వేటూరి గీతాలు వేదం అణువణువనవాదం, జోగారావు, హారిక పాడిన శ్రీలక్ష్మీ పెళ్లికి, బాల గణేశ్ , లీపిక పాడిన కిన్నెరసాని వచ్చిందమ్మా తదితర వాటితో ఆకట్టుకున్నారు. ప్రధాన కార్యదర్శి గంటి మురళీ, విజయనగరంనకు చెందిన నేత అవనాపు విజయ్, పైడా కృష్ణప్రసాద్, పీఠం అధ్యక్షులు ఉసిరికాల చంద్రశేఖర్, సుహాసినీ ఆనంద్, దాడి సత్యనారాయణ పాల్గొన్నారు.

49వ వార్డులో 'జనంలోకి జనసేన'



ఎన్‌జీజీఓస్ కాలనీలో ప్రచారం చేస్తున్న ఉషాకిరణ్, కార్యకర్తలు

మురళీనగర్, జనవరి 30 ; ఉత్తర నియోజకవర్గంలోని 49వ వార్డు మురళీనగర్ ఎన్‌జీజీఓస్ కాలనీలో మంగళవారం "జనంలోకి జనసేన" కార్యక్రమం నిర్వహించారు. పార్టీ ఇన్‌చార్జి పి.ఉషాకిరణ్ ఈసందర్భంగా మాట్లాడుతూ, రా ష్ట్రంలో పాలన స్తంభించిందని అన్నారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులో కూరుఉపోయేలా చేసిందని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన ఉమ్మడి గెలుపు కోసం ప్రజా మద్దతుతో ముందడుగేస్తున్నామన్నారు. వార్డు పరిధి ప్రాంతాల్లో నాయకులు తిరిగి ప్రచారం చేశారు.ఈ జనసేన నాయకులు సంకు.వెంకటేశ్వరరావు, 51వవార్డు పార్టీ అధ్యక్షులు జి.అప్పారావు, వీరమహిళలు, పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

పోలమాంబకు మారువారం పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

జగదాంబ కూడలి, జనవరి 30: జీవీఎంసీ 30 వార్డు కుమ్మరివీధిలోని పోలమాంబ ఆలయంలో మంగళవారం మారువారం ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ఉదయం ఆలయం ఎదుట బహుముఖ రూపాల్లో ఉన్న అమ్మవారి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి తొలి పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం ప్రాంగణంలో ఏర్పాటుచేసిన భజన గీతాలాపన కార్యక్రమం అలకరించింది. భక్తులకు ఉచితప్రసాదాలనుఅందజేశారు. కమిటీ ప్రత్యేకంగా పర్యవేక్షించింది. గత మంగళవారం పరస ఉత్సవాలు నిర్వహించిన విషయం తెలిసిందే.

పోలింగ్ బూత్‌లు తనిఖీ



ద్వారకానగర్ కృష్ణా విద్యామందిరంలో పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐలు

సీతమ్మధార, జనవరి 30: ద్వారకా పోలీసు స్టేషన్ పరిధిలోని ఎన్నికల పోలింగ్ బూత్‌లను సీఐఎస్.రమేశ్, ఎస్ఐలు జె. ధర్మేంద్ర, కె.శ్రీను సిబ్బందితో కలిసి మంగళవారం పరిశీలించారు. సీతంపేట, సీతమ్మధార పీఅండ్‌టీ కాలనీ, గురుద్వార, ద్వారకానగర్ తదితర ప్రాంతాల్లోని 42 పోలింగ్ బూ త్‌ల్లో పరిస్థితి, సమీప ప్రాంతాలను పరిశీలించారు.ఎన్నికల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పరిశీలించినట్లు సీఐ ఈ సందర్భంగా తెలిపారు.

సీఐను మర్యాదపూర్వకంగా కలిసిన జనసేన నాయకులు



సీఐకు పుష్పగుచ్ఛమిస్తున్న నాయకులు

మర్రిపాలెం, జనవరి 30: ఎయిర్‌పోర్ట్ పోలీసుస్టేషన్ సీఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన వి. చక్రధరరావును గ్రేటర్ 53వ వార్డు జనసేన నాయకులు నీరుకొండ దివాకర్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు అల్లి, మురళీ, వి.భాస్కర్, టి.మాణిక్యాలరావు, పాండ్రంగి దివాకర్, సురేశ్, కృష్ణారావు తదితరులు సీఐను కలిసినవారిలో ఉన్నారు.

ఆలిండియా బాక్సింగ్‌లో బుల్లయ్య విద్యార్థిని ప్రతిభ

విశాఖపట్నం (స్పోర్ట్సు), జనవరి 30: అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్ టోర్నీలో బుల్లయ్య కాలేజీ విద్యార్థిని ఎస్‌జీజేఎస్ మల్లిక రజత పతకం సాధించింది. ఈ సందర్భంగా మంగళవారం మల్లికను కాలేజీ కార్యదర్శి, కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వరరావు, జిల్లా బాక్సింగ్ సంఘం కార్యదర్శి బి.అప్పన్నరెడ్డి అభినందించారు. ఫిజికల్ డైరెక్టర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ బీఆర్ఎస్. లక్ష్మణరెడ్డి, యు.గంగా భవానీ పాల్గొన్నారు.



ఉభయ దేవేరులకు, అప్పన్న స్వామికి హారతిస్తున్న అర్చకుడు

సింహాచలేశునికి ఆర్జిత సేవలు

సింహచలం, జనవరి 30: వరాహలక్ష్మీనృసింహ స్వామికి మంగళవారం పలు ఆర్జిత సేవలనుఎ సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వేకువ జామున సుప్రభాత సేవ, ప్రభాత ఆరాధనలను యథావిధిగా జరిపారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై ఉంచారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. నృసింహ సహస్రనామావళి పఠిస్తూ పవిత్ర తులసీ దళాలతో సహస్రనామ తులసీ దళార్చన చేశారు.

అనంతరం గోవిందుని రజిత గరుడ వాహనంపై ఉంచి నృసింహ అష్టోత్తర శతనామావళితో పూజలు జరిపారు. సన్నాయి వాయిద్యాల నడుమ గరుడ వాహన సేవలో పాల్గొన్న భక్తులు స్వామిచుట్టూ ముమ్మార్లు ప్రదక్షిణలు చేశారు. ఆ తర్వాత నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

అప్పన్న సన్నిధిలో సంకీర్తనలు

ప్రముఖ ఆధ్యాత్మికవేత్త మారుతి ఆధ్వర్యంలో సింహగిరిపై 166 రోజులుగా నిత్య భజన సంకీర్తనల గానం కొనసాగుతోంది. ఇందులో భాగంగా మంగళవారం మురళీనగర్ ప్రాంతానికి చెందిన శ్రీలలితా అన్నమ్మయ్య సంకీర్తనల బృందం సుమారు రెండు గంటల పాటు పలు దేవతామూర్తుల నామాలతో భజనలు చేసి గీతాలాపనతో భక్తుల మన్ననలు పొందారు.

కేజీబీవీలో ఉత్సాహంగా ఫేర్‌వెల్

భీమునిపట్నం, జనవరి 30: ఇక్కడి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో మంగళవారం ఫేర్‌వెల్ కార్యక్రమం ఉల్లాసంగా.. ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సమగ్రశిక్ష అడిషినల్ కో-ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ త్వరలో జరగనున్న పదో తరగతి, ఇంటర్ పరీక్షల కోసం విద్యార్థినులందరూ ఇష్టపడి కష్టంతో చదవాలన్నారు. భవిష్యత్తు బంగారుబాటలో నడవడానికి ఒత్తిడి లేకుండా చదువు సాగించాలన్నారు. ఒక్కొక్కరిలో ఒక్కో ప్రతిభ దాగి ఉంటుందని, చదువుతో పాటు ఆ టాలెంట్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అందరూ శత శాతం ఉత్తీర్ణత సాధించడానికి కృషి చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. సమగ్రశిక్ష జీడీడీవో కాలేషా బేగం, విద్యాలయం ప్రిన్సిపాల్ గంగాకుమారి, తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల విజేత 'మూలకుద్దు'

భీమునిపట్నం (రూరల్), జనవరి 30: గత పది రోజులుగా గ్రామ, మండల స్థాయిలో జరిగిన ఆడుదాం ఆంధ్రా క్రీడల పోటీల్లో కబడ్డీ పురుషుల, మహిళల విభాగంలో మూలకుద్దు జట్టు సభ్యులు విజేతలుగా నిలిచారు. అలాగే ఖోఖో పురుషుల విభాగంలో చిల్లపేట బొగ్గులదిబ్బ జట్టు, మహిళల విభాగంలో అమనాం జట్టు గెలుపొందాయి. వాలీబాల్‌లోనూ పురుషుల విభాగంలో మూలకుద్దు జట్టు మండల స్థాయిలో విజేతగా నిలిచింది. మహిళల విభాగంలో భీమిలి తోటవీధి జట్టు విజేతగా నిలిచినట్టు అధికారులు తెలిపారు.

నిత్యావసర సరకులు అందజేత

తగరపువలస, జనవరి 30: తగరపువలస సంతపేట కొత్తమ్మతల్లి దేవాలయం సేవకురాలు పొత్తల నరసయ్యమ్మకు మంగళవారం వీఎస్ఆర్ కుటుంబ సభ్యులు నిత్యావసర సరకులను అందజేశారు. నరసయ్యమ్మ గత కొన్ని సంవత్సరాలుగా అమ్మవారి సన్నిధిలో సేవకురాలిగా ఉంటుంది. ఆమెకు బియ్యం, పప్పులు నూనె, తదితర నిత్యావసర సరకులను వీఎస్ఆర్ ఫౌండేషన్ సభ్యులు అందించారు.

సినిమా గైడ్

- **అయలాన్ :** మెలోడి, కిన్నెర, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక), తాతా (తగరపువలస)
- **కెప్టెన్ మిల్లర్ :** సంగం, వెంకటేశ్వర, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), దుర్గ (మధురవాడ), సప్తగిరి (తగరపువలస), నటరాజ్ (పెందుర్తి)
- **నా సామిరంగ :** శ్రీకన్య, శ్రీలీలామహల్, మౌర్య కన్య-2 (గాజువాక)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శారద, గోకుల్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ, సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), మోహిని కాంప్లెక్స్ లక్ష్మీకాంత్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), రాములమ్మ (తగరపువలస)
- **గుంటూరు కారం :** జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **ఫైటర్ (హిందీ) :** రమాదేవి, కామేశ్వరి,

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు19, టమాటా 24, వంకాయలు (తెలుపు) 18, వంకాయలు (నలుపు) 16, బెండకాయలు 48, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 44, బీరకాయలు 52, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 16, క్యాబేజీ 18, క్యారెట్ 18, దొండకాయలు 26, బంగాళదుంపలు 17, అరటికాయ (పె)7, అల్లం (పాతది) 120, మునక్కాడలు (కిలో) 74, బరబాటి 28, ముల్లంగి 18, నిమ్మకాయలు (కిలో) 80, గోరుచిక్కుడు 38, దోసకాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 310, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 46 , ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 28, కాప్సికమ్ 52, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 56, చిలగడదుంపలు 30 , కంద 54, దేముడు చిక్కుడు 32, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 20, మామిడి అల్లం 60, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	565
విజయనగరం	569
శ్రీకాకుళం	569

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	100
ఫారం ధర	--	120
విత్ స్కిన్	--	210
స్కిన్‌లెస్	--	220

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..



వైసీపీ కార్యాలయంలో మహాత్మాగాంధీకి నివాళులర్పిస్తున్న నాయకులు



పెదవాల్తేరులో నివాళులర్పిస్తున్న కొణతాల రామకృష్ణ, మూర్తియాదవ్, తదితరులు

స్వచ్ఛమైన సమాజ స్థాపన యువతతోనే సాధ్యం

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు

పలు ప్రాంతాల్లో జాతిపిత గాంధీకి నివాళి

భీమునిపట్నం, జనవరి 30: జాతిపిత మహాత్మాగాంధీ కలలు గన్న స్వచ్ఛమైన స్వరాజ్య స్థాపన యువత నడు బిగించాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు కోరారు. బాపూజీ వర్ధంతిని పురస్కరించుకుని బీచ్ రోడ్డులోని గాంధీ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మారోజు సంజీవ్‌కుమార్, కె.అప్పలనాయుడు, కె.ఎల్లాజీ, కె.అప్పన్న, పోలిరాజు, ఎ.నూకరాజు, వి.పోతురాజు, తదితరులు పాల్గొన్నారు. అలాగే బీచ్ రోడ్డులోని జీఎస్ఆర్ భవన్‌లో ఆదర్శ హిందీ ప్రేమి మండలి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గాంధీజీ చిత్రపటానికి సంస్థ అధ్యక్షుడు కేవీఎస్ఆర్ కృష్ణారావు, గంటా నూకరాజు పుష్పమాల వేసి అంజలి ఘటించారు. తీరంలోని బాపూజీ విగ్రహానికి సీపీఎం నాయకుడు రమణ, తదితరులు, బోయవీధి రామాలయం వద్దనున్న గాంధీ విగ్రహానికి మత్స్యకార పెద్దలు పూలమాల వేసి నివాళులర్పించారు.

మధురవాడ: స్థానిక వాంబే కాలనీ, ప్రియదర్శిని నగర్, వివేకానందకాలనీ, చంద్రంపాలెం, తదితర ప్రాంతాల్లోని మహాత్మాగాంధీ విగ్రహాలకు పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మధురవాడ పౌర సంక్షేమ సంఘం, టీడీపీ, బీజేపీ, కాంగ్రెస్, వైసీపీ, సీపీఐ, సీపీఎం, తదితర పార్టీలకు చెందిన నాయకులు మహాత్ముని సేవలను కొనియాడారు.

ఎం.వి.పి.కాలనీ: జాతిపిత మహాత్మాగాంధీ మార్గం అనుసరణీయమని టీవీ ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు అన్నారు. స్థానిక ఎస్.వి.వి.పి.వి. డిగ్రీ కళాశాలలో మంగళవారం గాంధీజీ వర్ధంతిని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.కాసు, డాక్టర్ అప్పారావు, డాక్టర్ అప్పలరాజు, తదితరులు మాట్లాడారు. విద్యార్థులు బాపూజీని స్మరిస్తూ గీతాలాపన చేశారు.

సింహచలం: గ్రేటర్ 98వ వార్డు పరిధి గాంధీనగర్‌లోని బాపూజీ విగ్రహానికి స్థానిక జర్నలిస్టులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం టీడీపీ వార్డు అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్పొరేటర్ పీవీ నరసింహం పుష్పమాల వేసి అంజలి ఘటించగా నాయకులు సతివాడ శంకరరావు, లండ



భీమిలి బీచ్ రోడ్డులో నివాళులర్పిస్తున్న గంటా నూకరాజు, తదితరులు

శ్రీను, అవినాష్‌బాబు, పి.ధర్మరాజు, తదితరులు పాల్గొన్నారు. కాగా వైసీపీ 98వ వార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో అడవివరం సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి పూలమాల వేయగా, సొసైటీ డైరెక్టర్ లండ వెంకటరమణ, మాజీ డైరెక్టర్ బి.శివరావు, దమ్ము ఎర్రాజీరావు నివాళులర్పించారు.

పెదవాల్తేరు: అహింస, సత్యాగ్రహాలే ఆయుధాలుగా అఖండ భారతావనికి స్వాతంత్ర్యాన్ని ప్రసాదించిన మహనీయుడు మహాత్మాగాంధీ అని జనసేన నేత కొణతాల రామకృష్ణ అన్నారు. పెదవాల్తేరులోని కొణతాల రామకృష్ణ కార్యాలయంలో బాపూజీ చిత్రపటానికి కొణతాలతో పాటు కార్పొరేటర్ మూర్తియాదవ్, జనసేన పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్లు కిరణ్‌ప్రసాద్, నాగలక్ష్మి, చౌదరి, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ఎంఎల్‌బీటీ పాఠశాలలో గాంధీ చిత్రపటం వద్ద పుష్పాలు ఉంచి ప్రిన్సిపాల్ కె.మధురవాణి తదితరులు అంజలి ఘటించారు. కార్యక్రమంలో గాయత్రి విద్యాపరిషత్ కార్యదర్శి ఆచార్య పి.సోమరాజు, డి.దక్షిణమూర్తి, ఆచార్య డి.కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎండాడ: బాపూజీ వర్ధంతిని ఎనిమిదో వార్డు పరిధిలో ఉన్న వైసీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు ఆధ్వర్యంలో పలువురు నాయకులు గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సిరిపురం: హిందు, ముస్లింలలో ఏ మతానికైనా ఉన్మాదం మంచిది కాదని పలువురు వక్తలు పేర్కొన్నారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద బాపూజీ వర్ధంతిని ఇస్కఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ మన దేశంలో మతం పేరుతో ఉన్మాదాన్ని రెచ్చగొట్టి అధికారాన్ని సుస్థిరం చేసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు, ప్రొఫెసర్ బాలమోహన్‌దాస్, ఇస్కఫ్ ప్రతినిధులు సుకుమారన్, ప్రభాకర్, సన్‌మూర్తి, మధుమతి, రాంప్రభు, ఉప్పల అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం: మండలంలోని మద్ది జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలోని గాంధీజీ విగ్రహానికి ఎంపీపీ కె.రాంబాబు, తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. హెచ్ఎం ప్రసూన, ఉపాధ్యాయులు ఎర్రయ్య, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

వెంకోజీపాలెం: క్షమాగుణం, ప్రేమ గాంధీజీ ప్రపంచానికి అందించిన సందేశమని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ అన్నారు. ఏయూలోని గాంధీ అధ్యయన కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా ఆయన బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ రచించిన హరిత గాంధేయం పుస్తకాన్ని ఆవిష్కరించారు.

పద్మనాభం (రూరల్): మండలంలోని అనంతవరంలో గాంధీ చిత్రపటానికి భీమిలి ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ గొర్రిపాటి పెద ఎర్రినాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు. గాంధీజీ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని కోరారు. సర్పంచ్ గొర్రిపాటి వెంకటలక్ష్మి, పెంట సర్పంచ్ బొదల పావని, మాజీ ఎంపీటీసీ అప్పలసూర్యనారాయణ, తాతాజీ, తదితరులు పాల్గొన్నారు.

బీసీలపై వైసీపీ ప్రభుత్వ కపట ప్రేమ

టీడీపీ విశాఖ పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం.శ్రీభరత్

5, 15 వార్డులలో జయహో బీసీ సదస్సుల నిర్వహణ

కొమ్మాది, జనవరి 30: బీసీలపై వైసీపీ ప్రభుత్వం కపట ప్రేమను కనబరుస్తోందని తెలుగుదేశం పార్టీ విశాఖ పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం.శ్రీభరత్ విమర్శించారు. మంగళవారం ఐదో వార్డు పరిధి బొట్టవానిపాలెంలో కార్పొరేటర్ మొల్లి హేమలత ఆధ్వర్యంలో 5, 6, 7, 8, 98 వార్డులకు సంబంధించి జయహో బీసీ సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి కోరాడ రాజబాబుతో పాటు శ్రీభరత్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం అన్నివిధాల బీసీలను అణగదొక్కుతుందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం కులాల వారీగా 56 కార్పొరేషన్లను ఏర్పాటు చేసి వాటికి నిధులివ్వకుండా ఉత్సవ విగ్రహాలుగా మార్చిందన్నారు. నాలుగున్నరేళ్లుగా బీసీలకు ఎలాంటి వ్యక్తిగత పథకాలను అందించలేదన్నారు. టీడీపీకి బీసీలు వెన్నుముఖ వంటివారని, రానున్న ఎన్నికల్లో బీసీలంగా తమ సత్తా చూపించి టీడీపీని అధికారంలోకి తెచ్చేందుకు కృషి చేయాలని శ్రీభరత్ కోరారు. కోరాడ రాజబాబు మాట్లాడుతూ ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి టీడీపీని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. అనంతరం 5, 6, 7 వార్డుల్లో భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మొల్లి హేమలత, పిళ్లా మంగమ్మ, టీడీపీ నాయకులు మొల్లి లక్ష్మణరావు, గొలగాని సన్యాసిరావు, జి.గురునాథ్, తమ్మిన విజయకుమార్, వాండ్రాసి అప్పలరాజు, నాగోతి సత్యనారాయణ, దాసరి శ్రీనివాస్, పిళ్లా నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.



ఐదో వార్డులో జరిగిన జయహో బీసీ సదస్సులో మాట్లాడుతున్న టీడీపీ నేత శ్రీభరత్

టీడీపీ హయాంలో బీసీలకు రాజ్యాధికారం

వెంకోజీపాలెం: బీసీలకు రాజ్యాధికారం కల్పించిన ఘనత టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకే దక్కుతుందని పార్టీ విశాఖ పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం.శ్రీభరత్ అన్నారు. 15వ వార్డులోని ఉక్కు కళావేదిక వద్ద జరిగిన జయహో బీసీ సదస్సులో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో బీసీలకు సముచిత స్థానం కల్పించడంతో పాటు రక్షణ చట్టాన్ని అమలు చేశారన్నారు. అయితే సీఎం జగన్ బీసీల 34 శాతం రిజర్వేషన్‌లో పది శాతం తగ్గించడంతో పాటు అన్ని రంగాల్లో వారిని అణచివేస్తున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే బీసీలకు రాజ్యాధికారంతో పాటు స్వయ ఉపాధి, రక్షణ చట్టాన్ని అమలులోకి వస్తుందన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో 35 లక్షల మంది డ్వాక్రా మహిళలకు ఆసరా పథకం అందించకుండా సీఎం జగన్ మోసం చేశారన్నారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ బీసీలపై వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. బీసీల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమానికి టీడీపీ వార్డు అధ్యక్షుడు బుగత సత్యనారాయణ అధ్యక్షత వహించగా నాయకులు సీహెచ్ పట్టాభిరామ్, ఎంవీ ప్రణవ్‌గోపాల్, బొట్టా వెంకటరమణ, పల్లా సన్యాసిరావు, మళ్ల రవికుమార్, బి.ధనరెడ్డి, సీహెచ్ గోవింద్, నారు గోపి, పల్లా ఉమారాణి, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారితే ప్రభుత్వ లక్ష్యం

భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఆనందపురం జనవరి 30: మహిళా సాధికారితే తమ ప్రభుత్వ లక్ష్యమని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని తర్లువాడలో మంగళవారం వైఎస్సార్ ఆసరా నాలుగో విడత నిధులు పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందినప్పుడే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుం దన్నారు. సీఎం జగన్ ప్రతి సంక్షేమ పథకాన్ని మహిళల పేరిటే అందిస్తూ వారి అభివృద్ధికి పునాదులు వేస్తున్నారన్నారు. మండలంలోని 1,293 సంఘాల్లో ఉన్న 13,701 మంది సభ్యుల కోసం రూ.10.45 కోట్లను వారి పొదుపు ఖాతాలలో జమ చేయడం జరిగిందన్నారు. అనంతరం పలువురు మహిళలకు ఆసరా నమూనా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శోభారాణి, ఎంపీడీవో లవరాజు, తహసీల్దార్ ఎల్.రామారావు, వైసీపీ నాయకులు బి.సత్యం, ఎం.వెంకటరావు, కె.వెంకటరావు, పి.శ్రీను, బి.ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



తర్లువాడలో మహిళలకు నమూనా చెక్కు అందజేస్తున్న ముత్తంశెట్టి

సింహచలం: ప్రభుత్వ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో వైసీపీని మళ్లీ గెలిపించాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కోరారు. 89, 98 వార్డుల పరిధిలోని డ్వాక్రా మహిళలకు ఆసరా పథకం కింద సుమారు రూ.2.03 కోట్ల చెక్కును అందజేశారు. మహిళలంతా సాధికారత సాధించా లన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో అడవివరం సహకార పరపతి సంఘం పాలక మండలి అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, డైరెక్టర్ జి.మురళీకృష్ణంనాయుడు, నాయకులు కొలుసు ఈశ్వరరావు, ఎర్ర వరంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికులను సమస్యలను పరిష్కరించాలి

జైభారత్ పార్టీ అధ్యక్షుడు వీవీ లక్ష్మీనారాయణ

సిరిపురం, జనవరి 30: ఆర్టీసీ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, ఇందుకోసం తాను కూడా కృషి చేస్తానని జైభారత్ పార్టీ అధ్యక్షుడు, సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ అన్నారు. ఏపీపీటీడీ నేషనల్ యూనిటీ అసోసియేషన్, విశాఖ రీజనల్ కమిటీ ఆధ్వర్యంలో నిరవధిక రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 13వ రోజుకు చేరాయి. దీక్షా శిబిరానికి విచ్చేసి సంఘీభావం తెలిపిన లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పదమూడు రోజులుగా కార్మికులు దీక్షలు చేస్తున్న ఆర్టీసీ విశాఖ డీపీటీవో పట్టించుకోకపోవడం దారుణమన్నారు. రీజనల్ కార్యదర్శి బి.నీలకంఠం మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను కార్మికులకు అందించకపోవడం శోచనీయమన్నారు. ఇంక్రిమెంట్లు, సిక్‌లకు జీతాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జి.రామారావు, వాల్తేర్ అధ్యక్షుడు పీజీ పతి, నాయకులు రాజు, ఎం.ఈ.రావు, తదితరులు పాల్గొన్నారు.



కార్మికుల దీక్షా శిబిరంలో వీవీ లక్ష్మీనారాయణ

ఊర్రూతలూగించిన జామర్స్ బ్యాండ్

ఎండాడ, జనవరి 30: సమాజంలో మానవత విలువలను పెంచడానికి 'కలిసి నడుద్దాం, కలిసి ఎదుగుదాం, ముందుకు సాగుదాం' అనే నినాదంతో పాటు మత్తు మందుల వినియోగానికి వ్యతిరేకంగా యువత ప్రతిజ్ఞ చేయాలంటూ గీతం విశ్వవిద్యాలయం, ప్రపంచ ప్రఖ్యాత ఆధ్యాత్మిక సంస్థ ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంయుక్తంగా గీతం వేదికగా నిర్వహించిన ఎడుయూత్ మీట్‌లో జామర్స్ బ్యాండ్ యువతను ఊర్రూతలూగించింది. గీతం క్రికెట్ గ్రౌండ్‌లో హాజరైన వేలాది మందిని జామర్స్ బ్యాండ్ సభ్యులు ఆకట్టుకున్నారు. జామర్స్ బ్యాండ్‌కు సింగర్ కృష్ణ తేజస్వి పాటలతో మైమరిపించాడు. యువత అంతా తమ దృష్టిని జామర్స్ బ్యాండ్‌కు చెందిన గాయకుడు, కీబోర్డు ప్లేయర్ నరేన్ ఆర్కే సిద్ధార్థ్, డ్రమ్మర్ శశాంక్ భాస్కరుని, గిటారిస్టు చిన్నస్వామి, బేసిస్ట్ జగదీశ్ పైనే ఉంచారు.

రహదారి భద్రతా నియమాలను పాటించాలి

కొమ్మాది, జనవరి 30: రహదారి భద్రతా నియమాలపై అందరూ అవగాహన కలిగి ఉండడంతో పాటు వాటిని పాటించాలని పీఎంపాలెం ట్రాఫిక్ సీఐ కాంతారావు అన్నారు. మంగళవారం కొమ్మాది విజయం పాఠశాలలో విద్యార్థులు, బస్ డ్రైవర్లు, హెల్పర్లకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ముందుగా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రీన్ వ్యాలీ ఫౌండేషన్ ప్రతినిధి ఉమారాజ్ 'మనవాళ్లకు దగ్గరగా ఉందాం-మత్తు పదార్థాలకు దూరంగా ఉందాం' అనే అంశంపై ప్రసంగించారు. ఐఐటీలో విజేతలుగా నిలిచిన విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, ఎస్ఐ వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.



ఎంఈవో కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

ఆనందపురం, జనవరి 30: తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన కార్మికులు మంగళవారం ఆనందపురం మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.మంగ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థుల సంఖ్యను పెంచేందుకుగాను పిల్లలకు రుచికరమైన పౌష్టికాహారాన్ని అందించాలనే మంచి లక్ష్యంతో మధ్యాహ్న భోజన పథకం అమలవుతోందన్నారు. అయితే ఈ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నీరుగారుస్తున్నాయని మండిపడ్డారు. గత 23 ఏళ్లుగా అధికారంలో ఏ ప్రభుత్వం ఉన్నా మధ్యాహ్న భోజన కార్మికులతో వెట్టిచాకిరి చేయిస్తూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. సీఎం జగన్ పాదయాత్ర సమయంలో తాము అధికారంలోకి వస్తే రూ.పది వేల వేతనం ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు మాట తప్పారన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని, ప్రమాద బీమా కల్పించాలని, ఈ పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించరాదని, రెండు నెలలకొకసారి ఎంఈఓలతో సమావేశాలు పెట్టాలని, తదితర డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంఈవో సిబ్బందికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు డి.రాము, మాధవి, రత్నం, త్రినాథ, సూర్యకాంతం, నారాయణమ్మ, గౌరి తదితరులు పాల్గొన్నారు.

'ప్రత్యేక హోదా అమలు కోసం కృషి చేద్దాం'

సిరిపురం, జనవరి 30: ప్రత్యేక హోదా అమలు, విభజన హామీలను సాధించుకునేందుకు కృషి చేద్దామని ప్రత్యేక హోదా విభజన హామీల సాధన సమితి సభ్యులు పేర్కొన్నారు. ఈ మేరకు జేడీ లక్ష్మీనారాయణను మంగళవారం వారు కలిసి వినతిపత్రం అందజేశారు. 2019 ఎన్నికల ప్రచార సమయంలో జగన్మోహన్‌రెడ్డి 25 ఎంపీలను తమకు ఇస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తీసుకువస్తానన్నారని, అధికారంలోకి వచ్చాక ఆ మాటే మరచిపోయారని విమర్శించారు. మన పిల్లల భవిష్యత్తు కోసం ప్రతీఒక్కరూ ప్రత్యేక హోదా సాధన కోసం కదిలి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని సమితి సభ్యులు చలసాని శ్రీనివాస్, రామకృష్ణ, శ్రీనివాసరావు, తదితరులు పేర్కొన్నారు.

కబడ్డీ పోటీల విజేత 'మూలకుద్దు'

భీమునిపట్నం (రూరల్), జనవరి 30: గత పది రోజులుగా గ్రామ, మండల స్థాయిలో జరిగిన ఆడుదాం ఆంధ్రా క్రీడల పోటీల్లో కబడ్డీ పురుషుల, మహిళల విభాగంలో మూలకుద్దు జట్టు సభ్యులు విజేతలుగా నిలిచారు. అలాగే ఖోఖో పురుషుల విభాగంలో చిల్లపేట బొగ్గులదిబ్బ జట్టు, మహిళల విభాగంలో అమనాం జట్టు గెలుపొందాయి. వాలీబాల్‌లోనూ పురుషుల విభాగంలో మూలకుద్దు జట్టు మండల స్థాయిలో విజేతగా నిలిచింది. మహిళల విభాగంలో భీమిలి తోటవీధి జట్టు విజేతగా నిలిచినట్టు అధికారులు తెలిపారు.

జాతీయ షూటింగ్ బాల్ పోటీలకు భీమిలి విద్యార్థులు

భీమునిపట్నం, జనవరి 30: ప్రకాశం జిల్లా చీరాలలో జరగనున్న జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు స్థానిక ది సన్ స్కూల్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. బుధ, గురువారాల్లో చీరాలలో ఈ పోటీలు జరగనున్నాయి. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపినట్టే ఇందులోనూ విద్యార్థులు సత్తా చాటుతారని స్కూల్ కరస్పాండెంట్ కె.శ్రీనివాసరావు ఆకాంక్షించారు. ఈ మేరకు పాఠశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థులను, తర్ఫీదు ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడిని ఆయన అభినందించారు.

ఏయూ తెలుగు విభాగంలో అతిథి ఉపన్యాసం

వెంకోజీపాలెం, జనవరి 30: ఏయూ తెలుగు విభాగం ఆధ్వర్యంలో 'దాశరథి సినీ సాహిత్యం-జనరంజక వీణానాదం' అనే అంశంపై అతిథి ఉపన్యాసం జరిగింది. ఈ కార్యక్రమానికి తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షత వహించగా ముఖ్య వక్తగా చెన్నై విశ్వవిద్యాలయ తెలుగు విభాగాధ్యక్షులు ఆచార్య విస్తాలి శంకరరావు, ముఖ్యఅతిథిగా ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, ఆత్మీయ అతిథులుగా సీనియర్ ఆచార్యులు వెలమల సిమ్మన్న, సమైక్య భారతి జాతీయ సమన్వయకర్త పి.కన్నయ్య హాజరయ్యారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సినిమా సాహిత్యం ఒకవైపు ఆనందాన్ని అందిస్తూనే సమాజ విలువలను తెలియజేస్తాయన్నారు. కార్యక్రమంలో పలువురు ఆచార్యులు పాల్గొన్నారు.

వెల్డింగ్ షాపులో అగ్ని ప్రమాదం

సాగర్‌నగర్, జనవరి 30: ఇక్కడి వెల్డింగ్ షాపులో సోమవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం సంభవించడంతో రూ.రెండు లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. షార్ట్ సర్క్యూట్ కారణంగానే అగ్ని ప్రమాదం వాటిల్లినట్టు స్థానికులు భావిస్తున్నారు. వెల్డింగ్ షాపు యజమాని దుంప రమణ సోమవారం రాత్రి షాపునకు తాళం వేసి ఇంటికి వెళ్లిన గంటలోనే మంటలు వ్యాపించాయి. షాపు కాలిపోతున్నట్టు సమాచారం అందుకున్న వెంటనే రమణ అక్కడకు చేరుకున్నాడు. అయితే అప్పటికే షాపులో ఉన్న సామాగ్రి మొత్తం దగ్ధమైందని విలపిస్తున్నాడు. ఈ ప్రమాదం వల్ల రూ.రెండు లక్షల నష్టం వాటిల్లినట్టు ఆయన తెలిపాడు.



కాలిపోయిన సామగ్రి

ఏయూను సందర్శించిన ఎన్ఐటీ రూర్కెలా విద్యార్థులు

వెంకోజీపాలెం, జనవరి 30: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని ఎన్ఐటీ రూర్కెలా వర్సిటీలో ఎమ్మెస్సీ అట్మాస్ఫియరిక్ సైన్స్ కోర్సును అభ్యసిస్తున్న పలువురు విద్యార్థులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పురాతనమైన మీటిరియాలజీ-ఓషనోగ్రఫీ విభాగంలో ఉన్న మౌలిక వసతులు, ప్రాజెక్టులు, మొబైల్ పొల్యూషన్ టెస్టింగ్ పరికరాలు వంటి వాటిని వీక్షించారు. విభాగాచార్యులు, బోధన, పరిశోధన వసతులను ప్రత్యక్షంగా తిలకించారు. చారిత్రక ప్రాధాన్యం కలిగిన ఈ విభాగాన్ని సందర్శించడం, ఇక్కడ ప్రత్యేకతలను తెలుసుకోవడం పట్ల ఎన్ఐటీ విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థుల బృందం ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెలను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ఆచార్యులు పి.సునీత, నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బంగారమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం


సాగర్‌నగర్/ఎండాడ, జనవరి 30: జీవీఎంసీ ఎనిమిదో వార్డు పరిధిలోని తాటిచెట్లపాలెం బంగారమ్మతల్లి ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయగా, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. అలాగే అమ్మవారిని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, నాయకులు చిక్కాల విజయకుమార్, చెట్టుపల్లి గోపి, ఎస్.శ్రీనివాసరావు ,బి.దొరబాబు, తదితరులు దర్శించుకున్నారు.

'కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలి'

కొమ్మాది, జనవరి 30: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న వినాశకర విధానాలను తిప్పికొట్టాలని సీఐటీయూ మధురవాడ జోన్ కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం ఇక్కడి సీఐటీయూ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా కార్మికులు, శ్రామికులు సంయుక్తంగా చేపట్టనున్న బంద్‌ను అందరూ విజయవంతం చేయాలని కోరారు. జోన్ కార్యదర్శి రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ కళాశాల మెస్‌ను పరిశీలించిన రిజిస్ట్రార్

వెంకోజీపాలెం, జనవరి 30: ఏయూ సైన్స్ కళాశాల విద్యార్థుల మెస్‌ను ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి అక్కడే భోజనం చేసి ఆహారాల నాణ్యతను స్వయంగా పరిశీలించారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న రిజిస్ట్రార్